## నేటి కందం-నేటికి అందం

నవనేతం నవి పిళ్ళై
భువి కొసగిన సేవల గని పూత మనస్సుల్
ప్రవిమల "నోబెల్" నొసగగ
స్రవియించెను జనుల కనులు సంతోషంబున్ !!

(భారతీయ మూలాలున్న నవనేతం నవి పిళ్ళై గారు అంతర్జాతీయ స్థాయిలో చేసిన న్యాయ సేవలకు గుర్తింపుగా ఆమెకు నోబెల్ బహుమతి రావడంతో అందరి కనులూ ఆనంద బాష్పాలు కురిశాయి. ప్రపంచం అంతా సంతోషించింది. భారత జాతి గర్వించింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

చురక

అప్రకటిత ఎమర్జెన్సీ
అమలుచేస్తూ దేశమంతా
ప్రజా ఉద్యమాల గొంతు
పిసికి చంపె దాని పంథా.
పరిపాలన సాగిస్తూ
ప్రజాస్వామ్య విరుద్ధం
అణచివేస్తే పిల్లి కూడా
అవును పులిలా సిద్ధం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 11-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:61 పేజీలు:6 వెల: రూ.1/-


## అజింక్య షిండే నేతృత్వంలో జంతర్‌మంతర్ నిరసన

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్‌తో శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనలకు కీలక సభ్యుడు అజింక్య షిండే నేతృత్వం వహించనున్నారు. గ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, అతడి బృందాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో ప్లాన్ 'బి' అమలుకు రంగం సిద్ధమైంది. ముంబై నుంచి ఢిల్లీకి విమానంలో



బయలుదేరిన అభిజీత్ దిప్కే, సీజేపీ సభ్యులైన సౌరవ్ దాస్, అశుతోష్ ర్యాంకాను ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ కాగానే విమానంలో ఉండగానే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత అజ్ఞాత ప్రదేశానికి వారిని తరలించారు.

కాగా, ఢిల్లీ పోలీసుల ఎత్తుగడలను ముందుగానే ఊహించిన సీజేపీ ప్లాన్ 'బి'ని సిద్ధం చేసింది. శనివారం విడుదల చేసిన ఒక ముందస్తు రికార్డెడ్ వీడియోలో అభిజిత్ దీప్కే ఈ విషయాన్ని ప్రకటించారు. అగ్రనాయకత్వం అందుబాటులో లేని సమయంలో నిరసనల బాధ్యతలను అజింక్య షిండేకు అప్పగిస్తున్నట్లు అందులో తెలిపారు. 'మీరు ఈ వీడియోను చూస్తున్నారంటే, నాతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ ర్యాంకా అరెస్టయ్యామని అర్థం. మా గైర్హాజరీలో నిరసన కార్యక్రమాలకు, సీజేపీ ఉద్యమానికి అజింక్య నాయకత్వం వహిస్తారు. దయచేసి ఆయనను అనుసరించండి' అని ఆ వీడియోలో దిప్కే పేర్కొన్నారు. అభిజిత్ దీప్కే బృందాన్ని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకోగానే సీజేపీ ఈ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

## రంగారెడ్డి జిల్లాలో రూ.2 లక్షల విలువైన ఎండీఎంఏ డ్రగ్స్ పట్టివేత

రంగారెడ్డి, అక్టోబర్ 10: జిల్లాలో షాబాద్‌లో ఎండీఎంఏ డ్రగ్స్ పట్టుబడింది. బెంగళూరు నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి షాబాద్‌లో విక్రయించేందుకు యత్నించగా.. పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. షాబాద్ మండలంలోని నాగరగూడ టీ పాయింట్ సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. షాబాద్ పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి దాదాపు 13.97 గ్రాముల ఎండీఎంఏ మాదకద్రవ్యాలు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేశారు. పట్టుబడిన మాదకద్రవ్యాల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా.

నిందితులు పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అధిక డబ్బు సంపాదించాలనే ఆశతో బెంగళూరు నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. మోకిలా, కోకాపేట తదితర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థులు, ఇతర వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబడిన వారు మారం వంశీ రెడ్డి (23), వీర ప్రవీణ్ కుమార్ (28) గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ శంకర్‌పల్లి మండలం ఇంద్రారెడ్డి నగర్‌కు చెందినవారిగా తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ వెల్లడించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువతకు, విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ యోగేష్ గౌతమ్ హెచ్చరించారు.

## భారతీయ సిబ్బంది ఉన్న చమురు ట్యాంకర్‌పై డ్రోన్ దాడి.. అందరూ సురక్షితం



న్యూఢిల్లీ, అక్టోబర్ 10:షార్జా తీరంలో పనామాకు చెందిన ఒక క్రూడాయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో నౌకలో ఉన్న 22 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ వెల్లడించారు. ఎంటీ జీఈఎం నెం.2 అనే చమురు ట్యాంకర్ యూఏఈ, షార్జా తీరంలో లంగరు వేసే ప్రాంతంలో ఉంది. ఈ నౌకలో 22 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. అక్టోబర్ 9న ఈ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది.

అయితే, ఈ దాడి ఘటనలో 22 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా ఉన్నారు. ఎవరికీ, ఎలాంటి హానీ కలగలేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ అంశంపై షిప్ మేనేజ్‌మెంట్ సంస్థను సంప్రదిస్తున్నామని, భారతీయ సిబ్బంది క్షేమం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని సోనోవాల్ వివరించారు. ఈ అంశంపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఘటన జరిగిన ప్రాంతం యూఏఈ, దుబాయ్, అరేబియన్ గల్ఫ్ తీరంలో ఉంది. ఈ డ్రోన్ దాడిని ఇండియా, లైబీరియా ఖండించాయి. నల్ల సముద్రంలో వాణిజ్య నౌకలు, నావికా సిబ్బందిపై దాడి జరగడాన్ని తప్పుబట్టాయి.

సముద్ర నౌకల రవాణా, సిబ్బంది భద్రత కోసం అంతర్జాతీయంగా సహకారం, సమన్వయం అవసరం అని ఇండియా, లైబీరియా అభిప్రాయపడ్డాయి. ఈ అంశంపై కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ స్పందించారు. సముద్రంలో వ్యాపారం, వాణిజ్యం నిర్వహించే దేశాలు, నౌక రవాణా దేశాలు, సిబ్బంది ఉన్న దేశాలు కలిసి ఏర్పడ్డ జీఓఎఫ్ ఆన్ ఎస్4 (గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్స్ ఆన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ షిప్పింగ్ సీఫేరర్స్) కలిసి నౌకలు, సిబ్బంది రక్షణ కోసం తగిన చర్యలు, ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఇప్పటికే ఈ గ్రూపు తొలి మీటింగ్ న్యూయార్క్‌లో జరగగా.. 25 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు.

# నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు..

### సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఇంద్రకీలాద్రి..



అమరావతి, అక్టోబర్ 10:: ఇంద్రగిరులపై కొలువుదీరిన కనకదుర్గమ్మ సన్నిధి.. అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చే అశేష భక్తజనం.. జయజయ ధ్వానాల మధ్య సాగే శరన్నవరాత్రి వైభవం.. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి ఇంద్రకీలాద్రి ముస్తాబైంది. ఆదివారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలకు సుమారు 25లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్న అధికారులు, దర్శనం నుంచి తిరుగు ప్రయాణం వరకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేశారు. భక్తులకు సులభ దర్శనం కల్పించడంతోపాటు కొండపై రద్దీని నియంత్రించడం, నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, భద్రతను పటిష్ఠం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ, మున్సిపల్, అగ్నిమాపక, వైద్య, పారిశుద్ధ్య తదితర విభాగాల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించనున్నారు. ఈసారి సిబ్బంది సంఖ్యతోపాటు సాంకేతిక నిఘా వ్యవస్థలకూ ప్రాధాన్యం ఇస్తున్నారు.

దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పించేలా దర్శన విధానంలో మార్పులు చేశారు. రూ.100, రూ.300, రూ.500 దర్శన టికెట్లను రద్దు చేసి నాలుగు క్యూలైన్ల ద్వారా ఉచిత దర్శనానికి అవకాశం కల్పిస్తున్నారు. రూ.1,000 టికెట్‌తో ప్రత్యేక శీఘ్రదర్శన సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. మనమిత్ర వాట్సాప్ సేవ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. టికెట్ పొందిన భక్తులను కుమ్మరిపాలెంలోని టీటీడీ స్థలం నుంచి దేవస్థానం బస్సుల్లో కొండపైకి తీసుకెళ్లి ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతిస్తారు. వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు సమయాన్ని కేటాయించారు. సాయంత్రం పూజలు, మహానివేదన సమయంలో దర్శనాల నిర్వహణకు అనుగుణంగా అధికారులు మార్పులు చేయనున్నారు. సాధారణ భక్తుల దర్శనానికి ఆటంకం కలగకుండా ప్రొటోకాల్ ప్రవేశాలను నియంత్రించనున్నారు.

ఉత్సవాల తొలిరోజైన ఆదివారం అమ్మవారు శ్రీ బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. తెల్లవారుజామున 2.30 గంటలకు సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభవ ఎవుతాయి. అనంతరం మూలవిరాట్టుకు స్నపనాభిషేకం, విశేష అలంకరణ, ఇతర పూజలు నిర్వహించి ఉదయం 8 గంటల నుంచి సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఉదయం 9 గంటలకు యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, నవరాత్రి కలశస్థాపన నిర్వహించనున్నారు. నూతన పూజా మండపంలో ప్రత్యేక కుంకుమార్చనలు, యాగశాలలో చండీహోమం జరుగుతాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ తొలి దర్శనం చేసుకోనున్నారు. తొలిరోజు మినహా మిగిలిన రోజుల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు దర్శనాలు కొనసాగుతాయి. రోజూ నిర్ణీత సమయాల్లో బాలభోగం, చిత్రాన్నం, రాజభోగం, పంచభోగం, విశేషభోగం నివేదనలు సమర్పిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు మహానివేదన, పంచహారతులు, చతుర్వేద స్వస్తి నిర్వహిస్తారు. ఈ సమయంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసి, కార్యక్రమాలు పూర్తయిన తర్వాత తిరిగి అనుమతిస్తారు.

ఉత్సవాల్లో భద్రత కోసం పోలీసు శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. సుమారు 3,200 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు వినియోగించనున్నారు. వీరిలో ఎనిమిది మంది ఎస్పీ స్థాయి అధికారులు, 14 మంది అదనపు ఎస్పీలు, 40 మంది డీఎస్పీలు, 75 మంది ఇన్‌స్పెక్టర్లు, 150 మంది ఎస్ఐలు,మిగిలిన సిబ్బందిలో ఇతర పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు, మహిళా సిబ్బంది, సహాయక బలగాలు ఉంటాయి. ఇంద్రకీలాద్రి, పరిసర ప్రాంతాలను 18 సెక్టార్లుగా విభజించి ఒక్కో సెక్టార్‌కు ఇన్‌స్పెక్టర్ లేదా ఎస్ఐని ఇన్‌చార్జిగా నియమిస్తారు. వారి విధులను డీఎస్పీ స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. వినాయకుడి ఆలయం, కుమ్మరిపాలెం, ఘాట్‌రోడ్డు, ఓం మలుపు, మహామండపం, క్యూలైన్లు, హోల్డింగ్ కేంద్రాలు, పార్కింగ్ ప్రదేశాల వద్ద ప్రత్యేక నిఘా ఉంటుంది.

ఈసారి పోలీసు బందోబస్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించనున్నారు. కృత్రిమ మేధ ఆధారిత రద్దీ విశ్లేషణ వ్యవస్థలు, డ్రోన్లు, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలు, సీసీ కెమెరాలు, ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థలను ఉపయోగించనున్నారు. కొండపైకి వెళ్లే వాహనాల ప్రవేశాన్ని నియంత్రించేందుకు బూమ్ బ్యారియర్లు, క్యూఆర్ కోడ్ తనిఖీలు ఏర్పాటు చేస్తున్నారు. క్యూలైన్లలో దర్శనానికి పట్టే సమయాన్ని భక్తులకు తెలియజేసేందుకు డిస్‌ప్లేలు ఏర్పాటు చేస్తారు. మోడల్ గెస్ట్‌హౌస్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తారు. భక్తుల రద్దీ, వాహనాల కదలికలు, అత్యవసర పరిస్థితులపై సమాచారం సేకరించి సంబంధిత అధికారులకు చేరవేసేలా వ్యవస్థను సిద్ధం చేస్తున్నారు. పోలీసు సిబ్బంది సంఖ్యను గత ఏడాదితో పోలిస్తే తగ్గించినప్పటికీ, సాంకేతిక నిఘా ద్వారా భద్రతను సమర్థంగా నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

దసరా ఉత్సవాల నిర్వహణలో పోలీసులతోపాటు ఇతర ప్రభుత్వ శాఖలు, దేవస్థానం, పారిశుద్ధ్య విభాగాల సిబ్బంది కీలక పాత్ర పోషించనున్నారు. అందించిన ఏర్పాట్ల వివరాల ప్రకారం సుమారు తొమ్మిది వేల మందితో మూడు షిఫ్టుల్లో సేవలు అందించే ప్రణాళిక ఉంది. దేవస్థానం సిబ్బంది సుమారు 300 మంది,ఇతర దేవాలయాల నుంచి సుమారు 200 మంది,రెవెన్యూ శాఖ, సుమారు 1,500 మంది. పోలీసు శాఖసుమారు 3,500 మంది, దేవస్థాన పారిశుద్ధ్య సిబ్బంది సుమారు 1,500 మంది,ఇతర పారిశుద్ధ్య సిబ్బంది సుమారు 1,800 మంది విధుల్లో ఉండనున్నారు. వీటితోపాటు అగ్నిమాపక, వైద్య, రవాణా, ఇంజినీరింగ్, నీటిపారుదల, రోడ్లు-భవనాల శాఖలు, ఇతర సహాయక విభాగాలు అవసరాన్ని బట్టి సేవలు అందించనున్నాయి. పార్కింగ్, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, మరుగుదొడ్లు, అత్యవసర వైద్యసేవలు, రహదారుల పర్యవేక్షణలో ఈ విభాగాల సమన్వయం కీలకం కానుంది.

వినాయకుడి ఆలయం నుంచి కొండపైకి సుమారు 1,650 మీటర్ల పొడవున క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో సుమారు 8,500 మంది భక్తులు వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు. రద్దీ పెరిగితే భక్తులను హోల్డింగ్ కేంద్రాలకు తరలించి అక్కడి నుంచి క్యూలైన్లలోకి అనుమతిస్తారు. మూడు హోల్డింగ్ కేంద్రాల్లో మొత్తం 18 వేల మంది వరకు వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు. అక్కడ తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు, ఇతర అవసరమైన సదుపాయాలు కల్పించనున్నారు. భారీ వర్షాలు కురిసినా, అత్యవసర పరిస్థితులు తలెత్తినా క్యూలైన్ల నిర్వహణకు ఆటంకం కలగకుండా కనకదుర్గనగర్, మహామండపం మీదుగా ప్రత్యామ్నాయ మార్గాన్ని సిద్ధం చేశారు. కొండపైకి ప్రైవేటు వాహనాలను అనుమతించకుండా కుమ్మరిపాలెంలోని టీటీడీ స్థలం నుంచి దేవస్థానం బస్సులు నడుపుతారు. దివ్యాంగులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తారు.

ఉత్సవాలకు వచ్చే భక్తుల వాహనాలతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ప్రాంతాలను గుర్తించారు. ఘాట్‌రోడ్డు, కుమ్మరిపాలెం, వాటర్‌వర్క్స్, ఓం మలుపు వంటి ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాలను దారి మళ్లించడం, కొండపైకి అనుమతించే వాహనాల సంఖ్యను నియంత్రించడం, అత్యవసర వాహనాలకు మార్గం కల్పించడం వంటి చర్యలు చేపట్టనున్నారు.

నూతన అన్నదాన భవనంలో రోజుకు సుమారు 15 వేల మందికి అన్నప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు భోజన సదుపాయం కల్పిస్తారు. లడ్డూ ప్రసాదాల పంపిణీ కోసం 18 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కనకదుర్గనగర్, బస్టాండ్, రైల్వేస్టేషన్, ఓం టర్నింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లతోపాటు లడ్డూ ఏటీఎంలను అందుబాటులో ఉంచుతున్నారు. ఉత్సవాల కోసం 55 లక్షల లడ్డూల తయారీకి దేవస్థానం లక్ష్యాన్ని నిర్దేశించింది. భక్తుల సౌకర్యార్థం 370 తాత్కాలిక మరుగుదొడ్లు, 54 ప్రాంతాల్లో తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. సీతమ్మవారి పాదాల నుంచి రాజీవ్‌గాంధీ పార్కు వరకు సుమారు కిలోమీటరు మేర స్నానఘాట్లలో 600 షవర్లు సిద్ధం చేశారు. దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణను మూడు షిఫ్టుల్లో కొనసాగిస్తూ ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, హోల్డింగ్ కేంద్రాలను నిరంతరం శుభ్రం చేయనున్నారు.

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు మహామండపం ఆరో అంతస్తులో అర్చక సభ, 18వ తేదీన వేద సభ నిర్వహించనున్నారు. ప్రతిరోజూ శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామివార్ల నగరోత్సవ సేవ జరుగుతుంది. ఆలయ రాజగోపురం దిగువ నుంచి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఊరేగిస్తారు. ఈ నెల 20వ తేదీతో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియనున్నాయి. ముగింపు రోజున సాయంత్రం 6 గంటలకు దుర్గాఘాట్‌లో శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామివార్ల హంస వాహన సేవ నిర్వహించనున్నారు.

## నరేంద్ర మోదీ రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పిన విపత్తు..

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10: ప్రకృతి విపత్తులు ప్రజల జీవితాలనే కాదు.. కొన్నిసార్లు రాజకీయ నాయకుల భవిష్యత్తును కూడా మార్చేస్తాయి. కొందరు పదవులు కోల్పోతారు.. మరికొందరు ఆ విపత్తు నుంచే ఎదుగుతారు. గుజరాత్‌లో 2001 జనవరి 26న సంభవించిన భుజ్ భూకంపం అలాంటి ఘటనే. వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఈ విపత్తు, గుజరాత్ పునర్నిర్మాణానికి పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారాయి. అప్పటికి భారతీయ జనతా పార్టీ కీలక నేతగా ఉన్న నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఆ భూకంపం వల్ల లభించింది

2001 జనవరి 26న గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో సంభవించిన భారీ భూకంపం తీవ్ర విధ్వంసాన్ని సృష్టించింది. భుజ్‌తో పాటు అనేక ప్రాంతాల్లో భవనాలు కూలిపోయాయి. వేలాది మంది మరణించగా, పెద్ద సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. ఇళ్లు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. సహాయక చర్యలు, శిథిలాల తొలగింపు, బాధితులకు పునరావాసం కల్పించడం అప్పటి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారాయి. భూకంపం తర్వాతి సహాయక చర్యల నిర్వహణ విషయంలో అప్పటి ముఖ్యమంత్రి కేశూభాయ్ పటేల్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో భారతీయ జనతా పార్టీ గుజరాత్‌లో నాయకత్వ మార్పుపై దృష్టి సారించిందిభారతీయ జనతా పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించిన మోదీని గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎంపిక చేశారు. 2001 అక్టోబర్ 7న ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేశారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసిన అనుభవజ్ఞులైన అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించారు. పునర్నిర్మాణ నిర్ణయాలను, పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఆ తర్వాత గుజరాత్‌లోని మౌలిక వసతులను నెలకొల్పడంపై దృష్టి సారించారు

భుజ్ భూకంపాన్ని మోదీ రాజకీయ జీవితంలో కీలక మలుపుగా పేర్కొనవచ్చు. 2001 అక్టోబర్ 7న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోదీ అప్పట్నుంచి అధికారంలోనే ఉంటూ వస్తున్నారు. 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా సేవలందిస్తున్నారు. 2026 అక్టోబర్ 7తో ఆయన ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.

## పట్టభద్రుల మద్దతు కూడగట్టండి..

### కాంగ్రెస్ శ్రేణులకు పొంగులేటి పిలుపు



ఖమ్మం, అక్టోబర్ 10: జిల్లాలో ఖమ్మం-వరంగల-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని.. ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. త్వరలోనే మరిన్ని ఉద్యోగ నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో పట్టభద్రుల మద్దతు పొందేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఓటరుకు వివరించాలని పార్టీ నాయకులు.. కార్యకర్తలకు సూచించారు.

ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమం విషయంలో రాజీపడటం లేదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను రూ.9 వేల కోట్లతో చెల్లించామని వెల్లడించారు. ఉద్యోగ నియామకాలు.. ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పట్టభద్రులకు వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఖాదర్ బాబా, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ అంటేనే 'బతుకమ్మ' పండుగ

## (10 - 18 అక్టోబరు "బతుకమ్మ పండుగ" శుభ సందర్భంగా)



తెలంగాణ అంటే బతుకమ్మ (బతుకు = జీవితం, అమ్మ = స్త్రీ లేదా తల్లి). బతుకమ్మ అంటే తెలంగాణ. బతుకమ్మ అంటే తల్లి దేవత సజీవంగా వస్తుందని, జీవిత దాత అని అభివర్ణిస్తారు. స్త్రీత్వానికి పోషక దేవతగా గౌరీ దేవిని ఆరాధిస్తారు. మహిళాలోకా ఇష్ట దైవమైన 'గౌరి (పార్వతి) అమ్మ' వారిని ఆటపాటలతో కొలుచుకునే పూల పండుగగా బతుకమ్మకు పేరుంది. ఊరు, వాడ ఆడపడుచులు అందరూ ఎక్క చోట చేరి పూల బతుకమ్మలను మధ్యలో అమర్చి వాటి చుట్టు చేరి సాంప్రదాయ పద్దతుల్లో పాటలు పాడుకుంటూ, నాట్యాలు చేస్తూ, బతుకమ్మ పండుగను వైభవోపేతంగా జరుపుకుంటారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు ప్రతీక. ప్రకృతి అందాలను ఆరాధిస్తూ, పుడమి చల్లి విశిష్టతను కీర్తిస్తూ, ఆనందాల తోరణాలను కట్టి, పడుచులంతా ఒక్క చోట చేరి జరుపుకునే 9 రోజులు జరుపుకునే పండుగగా బతుకమ్మకు గుర్తింపు ఉన్నది. ప్రకృతి సిద్ధంగా తెలంగాణ ప్రాంతాల్లో లభించే అందమైన, రంగు రంగుల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చుతారు. చెలకలు, చేనుల్లో మొలిచే సహజ పువ్వులైన తంగేడు, గునుగు, గుమ్మడి, కట్ల పూలు, సీత జడ పూలు లాంటివి సేకరించి బతుకమ్మలను పేర్చి మధ్యలో గుమ్మడి పూవ్వును, గౌరమ్మను అమర్చి కొలుచుకుంటారు. తంగేడు పువ్వు శక్తికి, గుమ్మడి పువ్వు మంగళకరమైన సౌందర్యానికి ప్రతీకలుగా తీసుకుంటారు.

### తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలు:

బతుకమ్మ అంటే బతకనిచ్చే చల్లని అమ్మ అని అర్థం చేసుకోవాలి. ప్రతి ఏట మహాలయా అమావాస్య (పెత్రామాస లేదా పితృ అమావాస్య) రోజున 10 అక్టోబర్ 2026 'ఎంగిలి పూల బతుకమ్మ'తో మొదలై తొమ్మిదవ రోజు 18 అక్టోబర్ 2026న 'సద్దుల బతుకమ్మ'తో ముగుస్తుంది. బతుకమ్మపై అమర్చిన పసుపుతో చేసిన గౌరమ్మను మహిళలు తమ మంగళ సూత్రాలకు పెట్టుకొని దీర్ఘ సుమంగళిగా ఉండాలని అమ్మ వారిని కోరుకుంటారు.

తీరొక్క పూలతో చేసిన పెద్ద పెద్ద బతుకమ్మలను సమీప చెరువు వద్దకు చేర్చి, వలయాకారంలో నిలబడి, నెమ్మదిగా లయబద్ధంగా కదులుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ, ఆటపాటలతో సంబరాలు చేసుకుంటారు. చివరకు సమీప చెరువుల్లో బతుకమ్మను నిమజ్జనం చేసి ప్రసాదాలు పంచి పెడతారు. ప్రతి రోజు ఒక నైవేద్యాన్ని తయారు చేసి దేవతకు సమర్పిస్తారు. 10 అక్టోబర్ 2026 రోజున 'ఎంగిలి పూల బతుకమ్మ'తో ప్రారంభమైన తొమ్మిది రోజుల పాటు 'అటుకుల బతుకమ్మ', 'ముద్దపప్పు బతుకమ్మ', 'నానే బియ్యం బతుకమ్మ', 'అట్ల బతుకమ్మ', 'అలిగిన బతుకమ్మ', 'వేపకాయల బతుకమ్మ', 'వెన్న ముద్దల బతుకమ్మ', 18 అక్టోబర్ రోజున 'సద్దుల లేదా పెద్ద బతుకమ్మ' పండుగలను నిర్వహించుకుంటారు.

### బతుకమ్మ పర్వదిన చారిత్రక నేపథ్యం:

బతుకమ్మ పండుగ ప్రారంభ నేపథ్యం అతి పురాతనమైనది. ధర్మాంగుడు అనే రాజుకు వంద సంతానం కలిగిన పుట్టిన తర్వాత చని పోతుంటారు. దుఃఖంలో మునిగిన రాజు దంపతులకు లక్ష్మీ దేవి రూపంలో వందవ సంతానంగా ఆడ బిడ్డ జన్మిస్తుంది. ఆ చిన్నారి పలు అనారోగ్యాలను జయిస్తూ, మునుల నుంచి 'నవ్వు కలకాలం బతుకమ్మ' అంటూ దివించబడుతుంది.

నాటి నుంచి నేటి వరకు తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన పర్వదినాలుగా 'బతుకమ్మ' పండుగను జరుపుకుంటున్నారు. పూల రంగుల మేళవింపుతో ప్రతి ప్రాంతం బతుకమ్మ పూదోటగా గుబాళిస్తుంది. బతుకమ్మ పాటల్లో పల్లె అందాలు, ప్రకృతి పట్ల మమకారాలు, పంట చేల పట్ల ఆరాదణలు స్పష్టంగా కనిపిస్తాయి. బతుకమ్మ పాటల్లో పల్లెతనం, అమాయకత్వం, ఒక ప్రకృతి ఆరాధణ, ఒక కథ, ఒక సంస్కృతి, ఒక ఆశ, ఒక స్ఫూర్తి దాగి ఉంటాయి. బతుకమ్మ పండుగకు ముందు ఏడు రోజుల పాటు బొడ్డెమ్మ పండుగ జరుపుకుంటాం.

పువ్వులు విరివిగా వికసించే కాలం, చెరువులు నిండు గర్భిణిలుగా కనిపించే కాలంలో వచ్చే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన గీతికగా, సంస్కృతిక ప్రతీకగా నిలుస్తున్నది.

తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా పూల బతుకమ్మ సదా నిలుస్తున్నది, అందరి ఆనంద ఆరోగ్యాలకు కారణం అవుతున్నది నేలతో నీటితో మానవులకు ఉన్న అనుబంధాన్ని బతుకమ్మ చాటుతున్నది.



-మధుపాళీ
9949700037

# భారత్, మాలీ ఆధ్వర్యంలో న్యూయార్క్..

## ఐరాస ప్రధాన కేంద్రంలో ప్రపంచ పత్తి దినోత్సవం

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒక కార్యక్రమాన్ని భారత- మాలీ శాశ్వత దౌత్య కార్యాలయాలు న్యూయార్క్.. ఐ.రా.స. ప్రధాన కేంద్రంలో నిర్వహించాయి. "దీర్ఘకాలిక అభివృద్ధి కోసం పత్తి: జీవనోపాధి మార్గాలు, విలువను పెంచడం, భాగస్వామ్యం" ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 75/318 తీర్మానాన్ని ఆమోదించి అక్టోబర్ 7ను ప్రపంచ పత్తి దినోత్సవంగా నిర్వహించాలని ప్రకటించింది. అభివృద్ధి పథంలో పురోగమిస్తున్న దేశాలు, అవసరమైనంత అభివృద్ధిని త్వరలో సాధించనున్న దేశాల్లో ఆర్థికాభివృద్ధి సాధన, అంతరాజతీయ వాణిజ్యం, పేదరికం నిర్మూలన లక్ష్యాలకు పత్తి ఎలా తోడ్పడగలదో ఈ దినోత్సవ నిర్వహణ కార్యక్రమం గుర్తు చేస్తుంది. ఈ కార్యక్రమంలో భారతదేశ పార్లమెంట్ సభ్యులు, సభ్య దేశాలతో పాటు అంతరాజతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. జీవనోపాధి కల్పన, విలువను పెంచడం, దీర్ఘకాలిక ప్రాతిపదికన అభివృద్ధి సాధన వంటి లక్ష్యాలకు పత్తి అందించగల తోడ్పాటు అంశంపై చర్చించారు.

ఐ.రా.స.లో భారతదేశ శాశ్వత ప్రతినిధి, రాయబారి శ్రీ హరీశ్ పర్వతనేని కార్యక్రమంలో స్వాగతోపన్యాసాన్ని ఇచ్చారు. స్వయంసమృద్ధి, ఆత్మగౌరవం, భారత స్వాతంత్ర్య పోరాటంతో పత్తినీ, చరఖానూ మహాత్మా గాంధీ జోడించినట్లు శ్రీ హరీశ్ గుర్తు చేశారు. ఉత్పత్తిదారుల బతుకుదెరువుకు ఊతాన్ని ఇవ్వడం, విలువను పెంచే ప్రక్రియలతో పాటు, మార్కెట్లను అందుబాటులోకి తీసుకు రావడం, పత్తి రంగ భవితకు సుస్థిరత్వాన్ని కల్పించడం, సాంకేతికతనీ, భాగస్వామ్యాలనీ బలోపేతం చేయడం .. ఈ నాలుగు ప్రధాన అంశాలను ప్రస్తావించారు. పత్తిని పండించే దేశాలకు విలువను పెంచే ప్రక్రియల్లోనూ, స్థిర ప్రాతిపదికను కలిగి ఉండే అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీస్)ను సాధించే మార్గంలో ముందుకు పోవడం లోనూ సాయపడటానికి ముడి సరుకులు (ఇన్‌పుట్స్) తక్కువ ధరలకు సరఫరా అయ్యేటట్లు చూడడం, ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు, అభివృద్ధి చెందాలని తపిస్తూ పరస్పరం సహకరించుకుంటున్న దక్షిణార్థ గోళ దేశాలకూ, చిన్న వాణిజ్య సంస్థలకూ దన్నుగా నిలవాల్సిన, మూడు విధాలుగా సహకారాన్ని అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఐ.రా.స.లో మాలీ శాశ్వత ప్రతినిధి, రాయబారి శ్రీ ఈసా కోన్‌ఫోరు మాట్లాడుతూ, మాలీ ఆర్థిక వ్యవస్థలోనూ, గ్రామీణ ప్రాంతాల నివాసులకు జీవనోపాధి కల్పనలోనూ పత్తి ప్రధాన పాత్రను పోషిస్తోందన్నారు. శుద్ధి (ప్రాసెసింగ్) సామర్థ్యం పరిమితంగానే ఉండటం, ఇన్‌పుట్ వ్యయం, విశాల మార్కెట్టుకు కొదవ, వాణిజ్య అసమతౌల్యానికి తావిస్తున్న విధానాలు ఈ రంగంలో సవాళ్లను రువ్వుతున్నాయని ఆయన వివరించారు. దేశీయంగా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచుకుంటూ మరింత మందికి ఉపాధిని కల్పించే దిశగా మాలీ ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. అభివృద్ధి చెందాలని తపిస్తూ పరస్పరం సహకరించుకుంటున్న దక్షిణార్థ గోళ దేశాల మధ్యే గాక ఇతరత్రా కూడా పరస్పర ప్రయోజనకరం కాగల భాగస్వామ్యాలు ఏర్పడాలని ఆయన సూచిస్తూ, ఈ విషయంలో భారత్ ఒక కీలక భాగస్వామిగా ఉంటోందని వెల్లడించారు.

సాంప్రదాయిక చేతివృత్తి పనివారు పత్తికి అదనపు విలువను ఎలా జత చేయగలగుతున్నదీ, మహిళలు ఎలా బతుకుదెరువును పొందుతున్నదీ, వనరులను తిరిగి ఉపయోగిస్తున్నదీ పార్లమెంట్ సభ్యుడు శ్రీ అసిత్ కుమార్ మల్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన పశ్చిమ బంగాల్.. బోల్‌పూర్‌లో కంథా బుటేదారు పనిని గురించి సభకు తెలియజేశారు. చేతివృత్తిదారులకు గిట్టుబాటయ్యే పారితోషికం, తక్కువ వడ్డీకి రుణాలు, డిజైన్ల కూర్పులో సాయంతో పాటు వారి ఉత్పాదనలు మార్కెట్ల వరకూ చేరుకోవడంలో మార్గదర్శనం అవసరమని ఆయన కోరారు.

పత్తిని నేసి వివిధ దుస్తులను రూపొందించడం, చిన్న వాణిజ్య సంస్థలు పోషిస్తున్న పాత్ర, మౌలిక సదుపాయాలను కలిసికట్టుగా వినియోగించుకోవడం, చేయి తిరిగిన పనివారు వంటి అంశాల్లో తమిళ నాడు సంపాదించిన అనుభవాన్ని పార్లమెంట్ సభ్యుడు శ్రీ ఎల్.కె. సుధీశ్ ప్రస్తావించారు. పీఎం మిత్ర కార్యక్రమంలో భాగంగా ఏకీకృత టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారనీ, టెక్స్‌టైల్ ప్రాసెసింగులో వ్యర్థ జలాలను పునర్వినియోగిస్తున్నారన్నీ ఆయన తెలిపారు.

పత్తి సాగులోనే కాక పత్తి వినియోగంలో కూడా భారత్ భూమిక, ఈ రంగంలో చిన్న-సన్నకారు రైతులకు ఉన్న ప్రాముఖ్యంపై కేంద్ర జౌళి శాఖ సంయుక్త కార్యదర్శి పద్మిని సింగ్‌లా మాట్లాడారు. మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ, కస్తూరి కాటన్ భారత్ కార్యక్రమం తీరుతెన్నులను వివరించారు. ఉత్పాదకతను, నాణ్యతను, ట్రేసబిలిటీని మెరుగుపరచడంపై మరింతగా దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. జౌళి రంగ మౌలిక సదుపాయాలను నిర్మించడంలో పెట్టుబడులు, చేతివృత్తి కార్మికులకూ, చిన్న వాణిజ్య సంస్థలకూ సాయాన్ని అందించడం, పత్తి వేల్యూ చైన్లు సుదీర్ఘకాలం పాటు మనుగడలో ఉండటానికి వీలుగా ఆంక్షలకు చోటు ఉండని, ప్రతికూలతలకు తావు ఇవ్వని వాణిజ్య విధానాలు, మార్కెట్టు లభ్యత కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

కార్యక్రమంలో ప్రసంగించిన వారిలో కోటే డీ ఐవర్, ఉజ్బెకిస్తాన్, చాడ్, నెదర్లాండ్స్, బుర్కీనా ఫాసో, ఈజిప్టులకు చెందిన శాశ్వత ప్రతినిధులు, కామెరూన్, పెరూ ల ఉప శాశ్వత ప్రతినిధులు, న్యూయార్క్‌లోని ఐరాస ఆహార, వ్యవసాయ సంస్థ సంబంధాల కార్యాలయం డైరెక్టరు ఏంజెలినా జైకోవ్, అంతర్జాతీయ పత్తి సలహా సంఘం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కేశవ్ ఆర్. క్రాంతి ఉన్నారు. పత్తి విలువ వ్యవస్థల్ని పటిష్ఠపరచడం, చిన్న రైతులకు, చేతివృత్తి పనివారికి ఊతాన్ని ఇవ్వడం, ప్రాసెసింగ్ సామర్థ్యాన్నీ, మార్కెట్టు లభ్యతనీ పెంచడం, సాంకేతికత పరిజ్ఞానం, ఉన్నత విజ్ఞానం ఉపయోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను విస్తరింప చేసుకొనేందుకు అవకాశాలు ఏ మేరకు ఉన్నదీ ప్రధానంగా చర్చించారు.

# దుర్గా నవరాత్రి, దసరాకు పటిష్ట భద్రత

### జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

కరీంనగర్, అక్టోబర్ 10: దుర్గా నవరాత్రి ఉత్సవాలు, విజయదశమి పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

శనివారం ఆయన మాటాడుతూ జిల్లాలో దుర్గా దేవి మండపాలు, దేవాలయాలు, రావణ దహన ప్రదేశాలు, ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. మండప నిర్వాహకులు పోలీసు శాఖ రూపొందించిన పోలీసుపోర్టల్.టిఎస్ పోలీస్ .జిఓవి.ఇన్. పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేసుకుని సహకరించాలని కోరారు. మండపాలను ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని, తప్పనిసరిగా సీసీ కెమెరాలు, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, నీరు, ఇసుక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 24 గంటలు నలుగురు వాలంటీర్లు ఉండాలని, క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, డీజేలు ఏర్పాటు చేయరాదని తెలిపారు. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని, మహిళలు, పిల్లలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# సూపర్‌మార్కెట్‌లో పైకప్పు కూలి 38 మందికి గాయాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 10: దక్షిణకొరియాలోని ఓ షాపింగ్ మాల్‌లో పైకప్పు కూలడంతో సుమారు 38 మంది గాయపడ్డారు. ఈ ఘటన డేగూ సిటీలో జరిగింది. ప్లాస్టర్ సీలింగ్ కూలినట్లు అధికారులు చెప్పారు. ఈ ఘటనలో చిక్కుకున్న 66 మందిని సురక్షితంగా తరలించినట్లు డేగూ అగ్నిమాపక శాఖ పేర్కొన్నది. ఇవాళ ఉదయం 10.16 నిమిషాలకు ఈ ఘటన జరిగింది. వివిధ ఆస్పత్రుల్లో కొందరు చికిత్స పొందుతున్నారు. గాయపడ్డవారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని, కానీ తీవ్రంగా గాయపడ్డ వారు ఎవరూ లేరని అధికారులు చెప్పారు. నాలుగు అంతస్తుల బిల్డింగ్‌లో రెండో అంతస్తు పైకప్పు ప్లాస్టరింగ్ కూలిందని ఫైర్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ యూన్ జాంగ్ మి తెలిపారు.

# పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణకు సమష్టి కృషి అవసరం

### ఎకోరెస్ 2026 జాతీయ సదస్సులో వక్తల పిలుపు



న్యూఢిల్లీ, అక్టోబర్ 10: సీఎస్ఐఆర్-నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఐఆర్?ఎన్ఈఈఆర్ఐ) హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం, ఎన్ఈఈఆర్ఐ సస్టైనబిలిటీ హబ్, ఇండియన్ అసోసియేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ (ఐఏఈఎం) సంయుక్తంగా "పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణ: పరిశ్రమలు, నియంత్రణ సంస్థల పాత్ర (ఎకోరెన్ 2026)" అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సును అక్టోబర్ 9, 2026న హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-ఐఐసీటీ ప్రాంగణంలో నిర్వహించాయి.

ఈ సదస్సులో శాస్త్ర, పరిశోధన సంస్థలు, పరిశ్రమలు, నియంత్రణ సంస్థలు, పర్యావరణ రంగానికి చెందిన ప్రతినిధులు పాల్గొని పర్యావరణ వ్యవస్థల సుస్థిర పునరుద్ధరణ, సహజ వనరుల పరిరక్షణ, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యంపై చర్చించారు. వేగవంతమైన పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న పర్యావరణ సవాళ్లను పరిష్కరించేందుకు శాస్త్రీయ పరిజ్ఞానం, సాంకేతిక పరిష్కారాలు, సమర్థవంతమైన విధానాలు, ప్రజల భాగస్వామ్యంతో కూడిన సమగ్ర విధానం అవసరమని సదస్సు నొక్కిచెప్పింది.

పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఏకలవ్య శర్మ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణలో స్థానిక సమాజాల భాగస్వామ్యం, బాధ్యత కీలకమని ఆయన పేర్కొన్నారు. దీర్ఘకాలిక ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ పెట్టుబడులు, సమర్థవంతమైన నియంత్రణ, శాస్త్రీయ నైపుణ్యం, తగిన సాంకేతిక పరిజ్ఞానం అవసరమని తెలిపారు. సహజ వనరులను సుస్థిరంగా నిర్వహించడంతోపాటు పర్యావరణ క్షీణతను నివారించేందుకు స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలని ఆయన సూచించారు.

సహజ వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పునర్భరణ, సుస్థిర నీటి నిర్వహణ, గాలి నాణ్యత మెరుగుదల, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలతో కూడిన సమగ్ర విధానాన్ని డాక్టర్ ఏకలవ్య శర్మ ప్రతిపాదించారు. హిమాలయ పర్యావరణ వ్యవస్థల పరిరక్షణను ప్రస్తావిస్తూ.. జీవవైవిధ్య సంరక్షణకు బహుళ ప్రయోజనాలను అందించే భూభాగాల సమగ్ర నిర్వహణ విధానం, శాస్త్రీయ పద్ధతులు, సాంకేతిక పరిష్కారాలు అవసరమని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించి పునరుజ్జీవింపజేసేందుకు పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక సంస్థలు, విధానకర్తల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దీర్ఘకాలిక దృక్పథంతో విస్తృతమైన ప్రణాళిక అవసరమని ఆయన స్పష్టం చేశారు.

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్, శ్రీ ఏ.వి. రంగనాథ్, ఐపీఎస్ గౌరవ అతిథిగా సదస్సుకు హాజరయ్యారు. చెరువుల పునరుద్ధరణలో హైడ్రా నిర్వహిస్తున్న పాత్ర, చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. చెరువుల పునరుద్ధరణతోపాటు క్షీణించిన భూములను పర్యావరణపరంగా సుస్థిరమైన భూభాగాలుగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆయన పేర్కొన్నారు.

సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్?ఐఐసీటీ) డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి గౌరవ అతిథిగా పాల్గొని, పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణలో సీఎస్ఐఆర్ ప్రయోగశాలలు అందిస్తున్న సేవలను వివరించారు. భారత ఆర్థిక వ్యవస్థపై సీఎస్ఐఆర్ పరిశోధనల ప్రభావాన్ని ప్రస్తావిస్తూ, పర్యావరణ సవాళ్ల పరిష్కారానికి పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక సంస్థలు, విధానకర్తల మధ్య సహకారం అవసరమని పేర్కొన్నారు.

కెమికల్ ఇండస్ట్రీ స్పెషలిస్ట్ శ్రీ ఎస్.ఎన్. శాస్త్రి మాట్లాడుతూ... పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణకు సమగ్ర విధానం అవసరమని పేర్కొన్నారు. ప్రాజెక్టులు స్పష్టంగా నిర్వచించిన లక్ష్యాలు, విస్తృతమైన ఉద్దేశాలతో పర్యావరణ వ్యవస్థలు, భూభాగాలపై గణనీయమైన సానుకూల ప్రభావాన్ని చూపాలని తెలిపారు. పారిశ్రామిక కార్యకలాపాల్లో వనరుల పునర్వినియోగం, వృత్తాకార ఆర్థిక విధానాలు, పునరుత్పాదక పద్ధతులను అనుసరించాలని సూచించారు.

సీఎస్ఐఆర్-ఎన్ఈఈఆర్ఐ డైరెక్టర్, ఎకోరెస్2026 ఛైర్మన్ డాక్టర్ ఎస్. వెంకట మోహన్ స్వాగతోపన్యాసం చేసి, ఈ సదస్సు ప్రాధాన్యాన్ని వివరించారు. సీఎస్ఐఆర్?ఎన్ఈఈఆర్ఐ హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం చైర్ డాక్టర్ షేక్ బాషా సదస్సులో నిర్వహించే సాంకేతిక సమావేశాల వివరాలను తెలియజేశారు.

పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణను వేగవంతం చేయడం, వాటి స్థిరత్వాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం కోసం పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక సంస్థలు, నియంత్రణ సంస్థలు, విధానకర్తలు, స్థానిక సమాజాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఈ సదస్సు నొక్కిచెప్పింది.

# గూడెం అయ్యప్ప ఆలయంలో వైభవంగా ఉత్తర నక్షత్ర పూజలు



ఆదిలాబాద్, అక్టోబర్ 10: గూడెం శ్రీ అభినవ శబరిమల అయ్యప్పస్వామి దేవాలయంలో ఉత్తర నక్షత్ర పూజను పురస్కరించుకుని శుక్రవారం స్వామి వారికి పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, ఉత్తర నక్షత్ర కవచ పారాయణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, గురుస్వామి శ్రీమాన్ చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అదేవిధంగా రానున్న దుర్గా నవరాత్రులను పురస్కరించుకుని దుర్గాభవానీ దీక్షల మాలధారణ కార్యక్రమాన్ని కూడా ఆలయంలో ఘనంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, భక్తిప్రపత్తులతో భవానీ దీక్షను స్వీకరించారు.

అయ్యప్పస్వామి భక్తులు, భవానీ దీక్షాధారులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల రాకతో దేవాలయం పండుగ వాతావరణాన్ని తలపించింది. స్వామి వారి నామస్మరణలు, ప్రత్యేక పూజలతో ఆలయ పరిసరాలు భక్తిమయంగా మారాయి.

# డీఎస్టీ, జీశాస్త్ర - సాంకేతిక మంత్రిత్వశాఖల వెబ్‌సైట్లను ప్రారంభించిన కేంద్ర మంత్రి

## డాక్టర్ జితేంద్ర సింగ్... సైన్స్‌ను అందరికీ అందుబాటులోకి తేవడమే లక్ష్యం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10: శాస్త్రీయ సమాచారాన్ని దేశవ్యాప్తంగా ప్రజలందరికీ సులభంగా అందుబాటులోకి తెచ్చేలా శాస్త్ర సాంకేతిక విభాగం ఈ రోజు సరికొత్తగా ప్రారంభించిన వెబ్‌సైట్లు.. విజ్ఞానాన్ని సమ్మిళితంగాను, ఉపయోగకరంగాను నిలపాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆలోచనలకు నిదర్శనమని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, భౌగోళిక విజ్ఞాన సహాయ (స్వతంత్ర హోదా) మంత్రి, ప్రధానమంత్రి కార్యాలయ, అణు ఇంధన, అంతరిక్ష, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. 'పౌరుడే ప్రథమం' అనే సుపరిపాలన దృక్పథాన్ని ఇది ప్రతిబింబిస్తోందన్నారు.

ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన స్పష్టం చేశారు. సైన్స్ సమాచారం అందరికీ లభ్యమయ్యేలా, సులభంగా అందుబాటులోకి వచ్చేలా, తక్కువ వ్యయంతో ఉండేలా చూడడం లక్ష్యంగా 'ప్రజల చేత, ప్రజల కోసం సైన్స్' అనే మార్గదర్శక సూత్రంతో దీనిని రూపొందించామని తెలిపారు. వివిధ శాస్త్రీయ విభాగాలు, పరిశ్రమల మధ్య సాంకేతికతల అనుసంధానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం కూడా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఒకే ఉమ్మడి డిజిటల్ వేదిక ద్వారా వినియోగదారులు తమ అవసరాలకు తగిన విధంగా సమాచారాన్ని, అవకాశాలను గుర్తించేందుకు ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.

డిజిటల్ బ్రాండ్ ఐడెంటిటీ మాన్యువల్ (డీబీఐఎం) 3.0, భారత ప్రభుత్వ వెబ్‌సైట్లు, యాప్‌ల మార్గదర్శకాలు (జీఐజీడబ్ల్యూ) 3.0 ప్రకారం పునర్నిర్మించిన డీఎస్టీ అధికారిక వెబ్‌సైట్లను కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభించారు. శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ ఉమేశ్ వి. వాఘ్మారే, డీఎస్టీ ఉన్నతాధికారులు, వెబ్‌సైట్ అభివృద్ధి బృంద ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంబంధిత శాఖ అంతర్గత విభాగాల ద్వారా వివరాలను సేకరించి, ధ్రువీకరించిన అనంతరం... డీఎస్టీ, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ), ప్రాజెక్ట్ నిర్వహణ బృందం, అభివృద్ధి ఏజెన్సీలు సంయుక్తంగా ఈ పునర్నిర్మాణ ప్రక్రియను పూర్తి చేశాయి.

డీఎస్టీ పథకాలు, గ్రాంట్లు, ఫెలోషిప్‌లు, శాస్త్రీయ కార్యక్రమాలు, ఇతర అవకాశాలకు సంబంధించి ఏకీకృత సమాచారాన్ని అందిస్తూ.. విద్యార్థులు, రీసెర్చ్ ఫెలోలు, పరిశోధకులు, విద్యా సంస్థలు, ఆవిష్కర్తలు, అంకుర సంస్థలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మీడియా ప్రతినిధులు, సామాన్య పౌరులకు ఈ డిజిటల్ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. కొత్తగా పునర్నిర్మించిన సమాచార వ్యవస్థ ద్వారా అర్హత నిబంధనలు, దరఖాస్తు మార్గదర్శకాలు, నిధుల కోసం ఆహ్వానాలు, పురస్కారాలు, ఫలితాలు, అధికారిక ప్రకటనల వంటి వివరాలను వినియోగదారులు అత్యంత వేగంగా గుర్తించవచ్చు. ఈ సమాచార వనరులన్నింటినీ ఒక క్రమబద్ధమైన పద్ధతిలో ఒక్కచోట చేర్చడం ద్వారా.. ప్రభుత్వ ప్రకటనల నిర్వహణను సులభతరం చేయడమే కాకుండా, దేశ శాస్త్ర సాంకేతిక వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ఈ పోర్టళ్ల ముఖ్య లక్ష్యమని శ్రీ జితేంద్ర సింగ్ వివరించారు.

ఈ వెబ్‌సైట్లలో సంస్థ వివరాలు, విభాగాలు, కార్యక్రమాలు-పథకాలు, సేవలు, అవకాశాలు, పత్రాలు, వార్తలు - తాజా సమాచారం వంటి ప్రధాన విభాగాలతో కూడిన ప్రామాణీకృత సమాచార వ్యవస్థను ఏర్పాటు చేశారు. సులభమైన శోధన వ్యవస్థ ద్వారా పరిశోధన - అభివృద్ధి నిధులు, ప్రతిపాదనల ఆహ్వానాలు, పురస్కారాలు, దరఖాస్తు ఫారాల వివరాలను వేగంగా కనుగొనవచ్చు. అలాగే వివిధ పత్రాలన్నీ ఒకే చోట అందుబాటులో ఉండే కేంద్రీకృత విభాగం ద్వారా మార్గదర్శకాలు, విధాన పత్రాలు, అధికారిక ప్రకటనలు, నివేదికలు, వరిపాలన దరఖాస్తులను సులభంగా పొందవచ్చు.

శాస్త్ర సాంకేతిక శాఖ పరిధిలోని వివిధ విభాగాలు, సంస్థాగత నిర్మాణ క్రమం, అధికారుల సంప్రదింపు వివరాలను వర్గీకరించి అందుబాటులో ఉంచడం ద్వారా సంబంధిత సమాచారాన్ని సులభంగా పొందేందుకు వీలు ఏర్పడింది. అలాగే అంతర్జాతీయ భాగస్వాముల కోసం ద్వైపాక్షిక, బహుపాక్షిక శాస్త్ర సాంకేతిక సహకారాలకు సంబంధించిన ప్రత్యేక సమాచారాన్ని కూడా ఈ వేదికలో పొందుపరిచారు.

ఈ కొత్త వెబ్‌సైట్ల మరో ముఖ్యమైన అంశం 'భాషిణి' వేదికను అనుసంధానించడం. దీని ద్వారా శాస్త్రీయ సమాచారాన్ని 22 భారతీయ భాషల్లో అందుబాటులోకి తెస్తూ, విస్తృత శ్రేణి ప్రజలకు సమాచారం చేరువయ్యేలా చేశారు. అలాగే అందరికీ సులభంగా ఉపయోగపడేలా అక్షరాల పరిమాణాన్ని మార్చుకునే వెసులుబాటు, హై-కాంట్రాస్ట్ డిస్‌ప్లే మోడ్, లింకలను ప్రత్యేకంగా చూపించే సదుపాయం, అక్షరాలు, లైన్ల మధ్య దూరాన్ని సరిచేసే ఆప్షన్లు, స్క్రీన్-రీడర్ సాంకేతికతకు తగిన అనుకూలత వంటి ప్రత్యేక సౌకర్యాలను కూడా ఈ పోర్టళ్లలో పొందుపరిచారు.

అన్ని రకాల స్క్రీన్ పరిమాణాలకు అనుకూలంగా ఉండే రెస్పాన్సివ్ డిజైన్‌తో ఈ వెబ్‌సైట్లను రూపొందించడం వల్ల డెస్క్‌టాప్‌లు, ట్యాబ్‌లు, మొబైల్ ఫోన్లలో కూడా చదవడానికి సులభంగా, స్పష్టంగా ఉంటాయి. వివిధ వర్గాల విద్యార్థులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు, ప్రజలకు ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక రంగానికి సంబంధించిన సమాచారాన్ని సులభంగా, వేగంగా అందుబాటులోకి తేవడం ఈ సదుపాయాల ముఖ్య ఉద్దేశం.

2025 మార్చిలో ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికతా మంత్రిత్వశాఖ విడుదల చేసిన డీబీఐఎం 3.0 ఆధారంగా ఈ పునర్నిర్మాణ ప్రక్రియ రూపుదిద్దుకుంది. ఈ మాన్యువల్ ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల రూపకల్పన, సమాచార నిర్మాణం, వివరాల సమర్పణ, మొత్తం డిజిటల్ నిర్వహణలో ఒక ఉమ్మడి ప్రమాణాన్ని అందిస్తుంది. దీనికి అనుబంధంగా జీఐజీడబ్ల్యూ 3.0 మార్గదర్శకాలు.. వెబ్‌సైట్ల నాణ్యత, అందరికీ అందుబాటులో ఉండే సదుపాయాలు, సైబర్ భద్రత, వినియోగ సౌలభ్యం, లైఫ్‌సైకిల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన నిబంధనలను నిర్దేశిస్తాయి.

ఈ డిజిటల్ పునర్నిర్మాణం భారత ప్రభుత్వం చేపడుతున్న విస్తృత ప్రణాళికలో ఒక భాగం. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వెబ్‌సైట్ల గుర్తింపు, నావిగేషన్, సమాచార నిర్వహణలో ఏకరూపతను తీసుకొస్తూ.. ప్రభుత్వ డిజిటల్ వ్యవస్థలన్నింటినీ ఒకే తాటిపైకి తేవడం దీని ముఖ్య లక్ష్యం. అందువల్ల ఈ మార్పు కేవలం వెబ్‌సైట్ రూపకల్పనకు మాత్రమే పరిమితం కాకుండా.. సమాచార పునర్నిర్మాణం, మెరుగైన వినియోగదారు అనుభవం, సమర్థమైన డిజిటల్ సమాచార నిర్వహణ వ్యవస్థల రూపకల్పన వరకు విస్తరించింది.

సులభంగా మార్పులు చేసుకోగలిగే 'మాడ్యులర్ కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్'తో రూపుదిద్దుకున్నాయి. ఇది సమాచారాన్ని నిరంతరం అప్‌డేట్ చేయడమే కాకుండా, భవిష్యత్తు విస్తరణకు, ఇతర బాహ్య శాస్త్ర సాంకేతిక అప్లికేషన్లతో అనుసంధానానికి ఎంతగానో తోడ్పడుతుంది. భద్రతా చర్యల విషయానికొస్తే.. ఎస్ఎస్ఎల్/టీఎల్ఎస్ ఎన్‌క్రిప్షన్, సైబర్ భద్రతా తనిఖీలు, సీఈఆర్‌టీ-ఐఎన్ మార్గదర్శకాలను సమర్థంగా అమలు చేశారు. కంటెంట్ డెలివరీ నెట్‌వర్క్ (సీడీఎన్) అనుసంధానం ద్వారా వెబ్‌సైట్‌లు అత్యంత వేగంగా లోడ్ అవ్వడమే కాకుండా.. పథకాల ఫలితాల ప్రకటనలు లేదా దరఖాస్తు ముగింపు తేదీల వంటి రద్దీ సమయాల్లో కూడా ఎలాంటి ఆటంకం లేకుండా స్థిరంగా పనిచేస్తాయి. పునర్నిర్మించిన 'వార్తలు - తాజా సమాచారం' విభాగం పత్రికా ప్రకటనలు, ప్రతిపాదనల ఆహ్వానాలు, ఫలితాలు, అధికారిక సమాచారాన్ని ఒకే చోట అందుబాటులోకి తెస్తూ.. వినియోగదారులు శాస్త్రీయ అవకాశాలను సులభంగా పొందేందుకు ఉపకరిస్తుంది.

మెరుగైన సమాచార శోధన, వివిధ భాషల్లో అందుబాటులో ఉండడం, అందరికీ అందుబాటులో ఉండే సౌకర్యాలు, ప్రామాణిక డిజిటల్ వ్యవస్థ ద్వారా... ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచారంలో పారదర్శకతను పెంచడంతోపాటు, ప్రజలకు సులభమైన భాగస్వామ్యాన్ని కల్పించడమే ఈ పునర్నిర్మిత వెబ్‌సైట్ల ముఖ్య లక్ష్యం. వైజ్ఞానిక కార్యక్రమాలు, పరిశోధన అవకాశాలు, సాంకేతిక పరిణామాల్లో మరింత సులభంగా పాల్గొనేలా విద్యార్థులు, పరిశోధకులు, విద్యా సంస్థలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ప్రజలకు వీలు కల్పిస్తూ... మరింత విస్తృతమైన, ప్రజా కేంద్రిత డిజిటల్ వాతావరణాన్ని ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుంది.

# ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలోని 25 డీజీ సెట్‌లకు రెట్రోఫిట్ ఉద్గార నియంత్రణ పరికరాలను అమర్చనున్న ఎన్‌హెచ్ఏఐ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10: జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలోని జాతీయ రహదారి కారిడార్లో పర్యావరణ పరిరక్షణ చర్యల బలోపేతం లక్ష్యంగా... బసాయి నుంచి ఖేర్కి ధౌలా/ఢిల్లీ-గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వే క్లోవర్‌లీఫ్ కూడలిని కలిపే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలోని 8.7 కిలోమీటర్ల పొడవైన ప్యాకేజ్-ఎలో ఏర్పాటు చేసిన 25 డీజిల్ జనరేటర్ (డీజీ) సెట్లకు రెట్రోఫిట్ ఉద్గార నియంత్రణ పరికరాలు (ఆర్ఈసీడీలు)ను అమర్చే కార్యక్రమాన్ని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) చేపట్టింది.

ముఖ్యంగా శీతాకాలంలో వాయు కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో... ఎన్‌సీఆర్ ప్రాంతంలో డీజిల్ జనరేటర్ (డీజీ) సెట్ల నియంత్రణకు సంబంధించి కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎమ్) ఆదేశాలకు అనుగుణంగా, గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్ఏపీ) కింద ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ప్యాకేజ్ ఎ ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతం పరిధిలోకి వస్తుంది. ఇక్కడ శీతాకాలంలో తీవ్రమైన వాయు కాలుష్యం ఉంటుంది. ఈ కీలక సమయంలో పరిసరాల గాలి నాణ్యతను మెరుగుపరచడానికి, ఈ ప్రాంతంలో పనిచేస్తున్న డీజీ సెట్ల కోసం నియంత్రణ, ఉద్గార నియంత్రణ చర్యలను సీఏక్యూఎమ్ తప్పనిసరి చేసింది.

ఎక్స్‌ప్రెస్‌వే లైటింగ్, ఇతర సంబంధిత కార్యకలాపాల కోసం ఉపయోగించే డీజీ సెట్లకు ఆర్ఈసీడీలను అమర్చుతారు. తద్వారా వాటి నిర్వహణ సమయంలో ఉద్గార నియంత్రణ చర్యలు బలోపేతం అవుతాయి. ఈ అమలు ప్రక్రియలో భాగంగా ఆర్ఈసీడీలను ఏర్పాటు చేయడం, పరీక్షించడం, వినియోగంలోకి తీసుకురావడంతో పాటు వాటి సమగ్ర నిర్వహణకూ మద్దతు లభిస్తుంది.

జాతీయ రహదారుల నిర్మాణం, నిర్వహణలో సమగ్ర పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఎన్‌హెచ్ఏఐ అనుసరిస్తున్న విస్తృత విధాన ప్రణాళికలో ఆర్ఈసీడీ కీలక భాగంగా ఉంది. ముఖ్యంగా ఎన్‌సీఆర్ పరిధిలోని ప్రాజెక్టుల్లో దీనిని అమలు చేస్తున్నారు. జాతీయ రహదారులకు సంబంధించిన కీలక కార్యకలాపాలకు అవసరమైన డీజీ సెట్‌లు... వర్తించే నియంత్రణ విధానాలకు అనుగుణంగా సరైన ఉద్గార-నియంత్రణ వ్యవస్థలను కలిగి ఉండేలా చూడటంలో ఈ కార్యక్రమం ఎంతగానో సహాయపడుతుంది. నిబంధనల అమలు, పారదర్శకతను తనిఖీ చేయడం కోసం.. ప్రతి డీజిల్ జనరేటర్ వద్ద అమర్చిన ఆర్ఈసీడీ పరికరాలకు సంబంధించి జీపీఎస్ ట్యాగ్‌తో కూడిన ఫోటోలను రికార్డులుగా భద్రపరచాలనీ ఎన్‌హెచ్ఏఐ స్పష్టం చేసింది.

ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలోని జాతీయ రహదారుల ప్రాజెక్టుల్లో ఎన్‌హెచ్ఏఐ చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ చర్యలు... వాయు నాణ్యతా ప్రమాణాల కఠిన నిబంధనలకు అనుగుణంగా రహదారి మౌలిక సదుపాయాల విస్తరణ, నిర్వహణను సమన్వయం చేయాలనే విస్తృత లక్ష్యంతో ముడిపడి ఉన్నాయి.

# పీజీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలి




ఆదిలాబాద్, అక్టోబర్ 10: స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల గోదావరిఖనిలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వై. ప్రసాద్ హాజరై మాట్లాడుతూ.. యువత తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు వాటి ప్రాముఖ్యతను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని సూచించారు.

బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రవి వివరించారు. ఈ కార్యక్రమంలో శ్యాం కుమార్, డాక్టర్ సుధ, డాక్టర్ అంబిక, అనిల్, రమ్య, రవీందర్, రఘుపతి, జ్యోతి, సతీష్, ఉదయ్ కిరణ్, ఎంబీఏ, ఎంకాం, ఎంసీఏ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన టీటీడీ అధికారులు



ఖమ్మం, అక్టోబర్ 10: ఖమ్మం నగరంలోని అల్లిపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణ స్థలాన్ని టీటీడీ అధికారులు పరిశీలించారు. టీటీడీ ఈఈ సురేంద్రనాథ్ రెడ్డి, ఏఈ జగన్మోహనరావు, ఏటీవో భాస్కర రావు, ఏటీవో అప్పలస్వామి, ఖమ్మం మేనేజర్ ఎన్. హరీష్ ఆలయ శంకుస్థాపన స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా టీటీడీ ఈఈ సురేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మంలో ప్రతిష్ఠాత్మకంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీ సోమవారం ఆలయ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు శుక్రవారం వెల్లడించారు. ఈ వేడుకకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పుర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. శంకుస్థాపన వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# అన్ని వర్గాలను కలుపుకొని పోయే, దీర్ఘకాలం పాటు మనుగడలో ఉండేభారత్ నిర్మాణానికి తోడ్పడుతున్న ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10:గ్రామీణ ప్రాంతాల్లో బతుకుదెరువు సాధనాలను బలపరచడంలో, ఉపాధి అవకాశాలను కల్పించడంలో, ఆత్మనిర్భర్ భారత్ దృష్టికోణాన్ని పటిష్ఠపరచడంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల (కేవీఐ)ది ఓ ముఖ్య భూమిక. భారత సుసంపన్న సాంస్కృతిక వారసత్వంతో పెనవేసుకున్న ఖాదీ పరిశ్రమ సాంప్రదాయిక హస్తకళా కౌశలాన్ని మన్నికైన ఉత్పాదన పద్ధతులతో ముడిపెడుతోంది. గ్రామీణ ప్రాంతాల నివాసులకు బతుకుదెరువును కూడా ప్రసాదిస్తోంది.

చేతితో వడకడం, నేత/అల్లిక పనితనం ద్వారా ఖాదీ తన రూపాన్ని సంతరించుకుంటుంది. ప్రాకృతిక నారలను, స్థానిక ఉత్పాదన వ్యవస్థలను ఉపయోగించి దీనిని తయారు చేస్తారు. ఇది శ్రమపై ఆధారపడే, వికేంద్రీకృత ప్రక్రియ కావడం వల్ల వివిధ నైపుణ్య స్థాయుల్లో ఉద్యోగ అవకాశాలను అందిస్తూ, గ్రామీణ ప్రాంతాల నిరంతర అభివృద్ధికి దోహదం చేస్తోంది. ఈ రంగం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) లో ఒకటో లక్ష్యం (పేదరిక నిర్మూలన)తో పాటు, ఎనిమిదో లక్ష్యానికి (తగిన పని, ఆర్థికాభివృద్ధి) దన్నుగా నిలుస్తోంది.

చేతులను ఉపయోగించి వడికే ప్రక్రియే ఖాదీకీ, చేతి మగ్గానికీ మధ్య ఉన్న ప్రధాన తేడాను సూచిస్తోంది. కొన్ని సంవత్సరాలుగా, ఖాదీ గ్రామీణ పరిశ్రమల సంఘం (కేవీఐసీ) నైపుణ్యాభివృద్ధి, సామర్థ్యాల పెంపు, అదనపు ప్రావీణ్యాలను నేర్పించే కార్యక్రమాలను అమలు చేస్తూ ఖాదీ సంస్థలకు కావలసిన సహకారాన్ని సమకూరుస్తోంది. నూలు వడికే పనికి, నేత పనికి వేతన రేట్లను కిందటి సంవత్సరం ఏప్రిల్ నుంచి పెంచడం, మెరుగైన పనితీరును కనబరిచే పరికరాలను, మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవడానికి దన్నునివ్వడం, మార్కెట్లో విక్రయాలకు మార్గాన్ని సుగమం చేయడం వంటి చర్యలు చేతి వృత్తిదారుల ఆదాయాన్ని మెరుగుపరచడానికే కాకుండా సాంప్రదాయిక జీవనోపాధులను ఆర్థికంగా నిలకడతనం కలిగినవిగా తీర్చిదిద్దడానికి కూడా తోడ్పడ్డాయి.

సమకాలీన ఫ్యాషన్‌గా, జీవన శైలికి సంబంధించిన ఎంపికగా ఖాదీ ఎదిగింది. ఖాదీ డెనిమ్, డిజైనర్ చీరలు, పెళ్లికూతురు దుస్తులు, ఆధునిక షర్టులు, ట్రౌజర్స్ వంటి కొత్త ఉత్పాదనల శ్రేణులు నవతరం వినియోగదారుల్లో ఖాదీ ఆదరణను మరింత పెంపొందింపచేశాయి. ఢిల్లీ.. ఎన్ఐఎఫ్‌టీలో నెలకొల్పిన ఖాదీ శ్రేష్ఠతా కేంద్రం (సీఓఈ) వివిధ శ్రేణుల్లో 2,129 ఖాదీ డిజైన్ కలెక్షన్లను రూపొందించింది. 710 కొత్త ఉత్పాదనలతో నవ్‌యుగ్ ఖాదీనీ, 'స్వధా' పేరిట వెల్‌నెస్ యోగా వేర్ కలెక్షన్‌నీ పరిచయం చేయడం ఖాదీకి సమకాలీన వర్గాల్లో ఆదరణను మెరుగుపరిచాయి.

ఖాదీ వికాస్ యోజన, గ్రామోద్యోగ్ వికాస్ యోజన, పీఎమ్‌ఈజీపీ వంటి పథకాలను ప్రభుత్వం అమల్లోకి తీసుకు వచ్చి ఖాదీ గ్రామీణ పరిశ్రమల రంగంలో ఉపాధికల్పనను ప్రోత్సహిస్తున్నది. ఆర్థిక సహాయాన్ని అందించడం, నిర్వహణ మూలధనాన్ని సమకూర్చుకోవడానికి మార్గాన్ని సుగమం చేయడం, నాణ్యమైన ముడి పదార్థాలు, శిక్షణ, టూల్‌కిట్స్, వేతన సబ్సిడీ, విక్రయ దశలో సూచనలనూ సలహాలనూ ఇవ్వడం, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం, సామాజిక భద్రతా చర్యలను చేపట్టడం ద్వారా వివిధ రూపాల్లో సహాయాన్ని అందిస్తున్నారు. అనేక పథకాలు అమలు కావడంతో 75 శాతం కన్న ఎక్కువ మంది చేతివృత్తి దారుల ఆదాయం చెప్పుకోదగ్గ మేరకు వృద్ధి చెందిందని అహమదాబాద్‌లోని ఈడీఐఐ నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది.

మహిళలకు ఆర్థిక సాధికారత కల్పన, సమ్మిళిత అభివృద్ధి అన్న లక్ష్యాల సాధనకు ఖాదీ సహకరిస్తోంది. దాదాపు అయిదు లక్షల మంది ఖాదీ చేతివృత్తిదారులలో 80 శాతం వరకూ మహిళలే. అగర్‌బత్తి, చేతితో తయారు చేసే కాగితం, తేనె ఉత్పాదన, సేవల పరిశ్రమలు వంటి రంగాల్లో వీరి భాగస్వామ్యం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. ఇది వారికి ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు, సుస్థిర జీవనోపాధి అవకాశాలను కూడా కల్పిస్తోంది. చేతులతో తయారు చేసిన, గుర్తించదగిన, ప్రాకృతిక, పర్యావరణానుకూల ఉత్పాదనలకు ప్రపంచ వ్యాప్తంగా గిరాకీ పెరుగుతుండటంతో ఖాదీ ఉత్పాదనలకూ, చేతితో రూపొందించిన వస్తువులకూ ఎగుమతి అవకాశాలు గణనీయంగా వృద్ధి చెందాయి.

# కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష

## సూర్యాపేట జిల్లా కేంద్రంలో దశాబ్ది వేడుకలు

## కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్



నల్గొండ, అక్టోబర్ 10 సూర్యాపేట జిల్లా ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు శ్రీ బడుగుల లింగయ్య యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 2ని రన్ కార్యక్రమంలో కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడమే కాకుండా పదేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనత కేసీఆర్‌కి దక్కుతుందని ఆయన అన్నారు. కేసీఆర్ గొప్పతనాన్ని యావత్ తెలంగాణ ప్రజానీకానికి గుర్తుచేయడానికే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఒకప్పుడు తెలంగాణలో ఉపాధి లేక పట్టణాలకు కూలీ కోసం వలస వెళ్లేవారని, గట్కో గంజో తాగి పస్తులున్న రోజులు ఉండేవని ఆయన గుర్తుచేశారు. అన్ని వనరులు ఉన్నప్పటికీ వివక్ష కారణంగా వాటిని వాడుకోలేని పరిస్థితి నుంచి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. గతంలో దివంగత నేత ఎన్టీఆర్ గారు మండలాలను ఏర్పాటు చేస్తే, ఆ తర్వాత పట్టించుకున్నవారు లేరని అన్నారు. ఒకప్పుడు చిన్న పనుల కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లి బస్టాండ్లలో పడుకునే పరిస్థితి ఉండేదని, పరిపాలనను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో కేసీఆర్ జిల్లా కేంద్రాలను ఏర్పాటు చేశారని వివరించారు.

దేశంలో పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని ప్రశంసించారు. వ్యవసాయానికి పనికిరావు అనుకున్న మారుమూల భూములకు సైతం కృష్ణమ్మ, గోదావరి జలాలను అందించి తెలంగాణను ధాన్యపు రాశులుగా మార్చిన అపర భగీరథుడు కేసీఆర్ అని కీర్తించారు. దీనివల్ల రియల్ ఎస్టేట్ పెరిగి భూముల ధరలు నేడు కోట్ల రూపాయలకు చేరుకున్నాయని తెలిపారు. కేసీఆర్‌ని కాదని మార్పు కోరుకుంటే నేడు కాంగ్రెస్ పాలనలో కట్టిన ఇల్లు పీకినట్లుగా రాష్ట్రాన్ని కుక్కలు చించిన విస్తరిలా తయారు చేశారని విమర్శించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని, కరెంటు లేక, యూరియా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండిన పంటకు సరైన మద్దతు ధర ఇచ్చి కొనే నాథుడు లేడని అన్నారు. జరిగిన అభివృద్ధిని కొనసాగించాలన్నా, ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నా మళ్లీ కేసీఆర్ నాయకత్వం ఎంతో అవసరమని, రాష్ట్ర సంక్షేమానికి, అభివృద్ధికి కేసీఆర్ మాత్రమే శ్రీరామరక్ష అని ఆయన స్పష్టం చేశారు.

# నందికొట్కూరులో ఎస్ఐఎస్ 2026 పై సమీక్ష

## నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు రోల్ అబ్జర్వర్ ప్రశాంతి ఐ.ఏ.ఎస్ హెచ్చరిక!

### 136నందికొట్కూరు నియోజకవర్గంలో 6 మండలాల అధికారులతో కీలక భేటీ

అమరావతి, అక్టోబర్ 10:: పట్టణంలో స్టేట్ గెస్ట్ హౌస్ లో వివిధ శాఖల అధికారులతో ఈ సమీక్షలో ఈ.ఆర్.ఓ. శ్రీ సి. వెంకట శివ ఆర్.డి.ఓ.ఆత్మకూరు ఏ.ఈ.ఆర్.ఓ.లు బి. శ్రీనివాసులు చంద్రశేఖర్ నాయక్ శివరాముడు పగిడ్యాల శ్రీనివాసులు సుభద్ర పాములపాడు ఉమారాణి మరియు ఎన్నికల సిబ్బంది సూపర్ వైజర్లు బి.ఎల్.ఓ.లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్.ఐ.ఆర్. 2026 లో వచ్చిన ఫారం 6 ఫారం7 ఫారం8 దరఖాస్తులను అబ్జర్వర్ క్షుణ్ణంగా పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు.ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని ఎన్నికల రోల్ అబ్జర్వర్ ప్రశాంతి ఐ.ఏ.ఎస్. స్పష్టం చేశారు. బి.ఎల్.ఓ.లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయాలని ఆదేశించారు.

# ఆహార శుద్ధి రంగంలో విస్తృత అవకాశాలు; యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసేవారుగా కాకుండా, ఉద్యోగాలు కల్పించేవారిగా మారాలి: శ్రీ చిరాగ్ పాశ్వాన్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10:దేశంలో ఆహార శుద్ధి రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని, ఉపాధి కల్పన, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించడం, అంతర్జాతీయంగా భారత్ ప్రాధాన్యాన్ని మరింత పెంచడంలో ఈ రంగం కీలక పాత్ర పోషించే సామర్థ్యం కలిగి ఉందని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ అన్నారు.

కుండ్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్ – కే) ఏడో స్నాతకోత్సవంలో చిరాగ్ పాశ్వాన్ ప్రసంగించారు. పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూసేవారిగా మిగిలిపోకుండా, ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా, నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టే సృజనకర్తలుగా, సమస్యలకు పరిష్కారాలు చూపే నిపుణులుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆహార శుద్ధి రంగంలో గత కొన్నేళ్లలో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, ఇంకా ఈ రంగంలో అపారమైన అవకాశాలు అందుబాటులోకి రావాల్సి ఉందని ఆయన అన్నారు. ఆహార నాణ్యతను మెరుగుపరచడం, ఉత్పత్తులకు అదనపు విలువ జోడించడం, రైతులకు మెరుగైన ఆర్థిక అవకాశాలు కల్పించడం, ఉపాధిని పెంచడం, ఆహార వృథాను అరికట్టడం వంటి పలు అంశాల్లో ఈ రంగం ఏకకాలంలో కీలకంగా నిలవగలదని పేర్కొన్నారు.

భారత్‌లో విస్తృత వ్యవసాయ రంగం, విభిన్న రకాల వ్యవసాయ ఉత్పత్తులు, వినియోగదారుల భారీ మార్కెట్ దేశాన్ని 'ప్రపంచ ఆహార కేంద్రం'గా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని శ్రీ చిరాగ్ పాశ్వాన్ అన్నారు. ఆహార విలువ శ్రేణులను, శుద్ధి సదుపాయాలను, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ క్షేత్రాలకు, గ్రామీణ ప్రాంతాలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని, తద్వారా క్షేత్రస్థాయిలోని ఉత్పత్తిదారులకు ఆహార శుద్ధి రంగం ద్వారా లబ్ధి చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు.

సంప్రదాయ మార్గాలకు పరిమితం కాకుండా విభిన్నంగా ఆలోచించాలని విద్యార్థులకు పిలుపునిచ్చిన ఆయన.. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కారాలు కనుగొనేందుకు సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, పారిశ్రామికతను వినియోగించుకోవాలని కేంద్ర మంత్రి సూచించారు. ఆహార శుద్ధి రంగాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో కొత్త ఆలోచనలు, వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే యువ ఆవిష్కర్తలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

ఆహార రంగంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీ చిరాగ్ పాశ్వాన్ స్పష్టం చేశారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని ఉద్ఘాటించారు. భారతీయ ఉత్పత్తి నాణ్యత ఒక సంస్థ ప్రతిష్ఠకే పరిమితం కాదని, అది అంతర్జాతీయ మార్కెట్లలో 'బ్రాండ్ ఇండియా'కు లభించే గుర్తింపుపైనా ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ కార్యదర్శి అవినాష్ జోషి మాట్లాడుతూ.. ఆహార వృథాను తగ్గించడం, పోషక విలువలను పెంచడం, ఉత్పత్తులకు అదనపు విలువ జోడించడం, జీవనోపాధి అవకాశాలు కల్పించడం, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంలో ఆహార శుద్ధి రంగం విస్తృత పాత్ర పోషిస్తుందని వివరించారు. నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు. విస్తృత స్థాయిలో విలువను సృష్టించగల ఆలోచనలు, నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థులు, పరిశోధకులు కృషి చేయాలని సూచించారు.

నిఫ్టెమ్-కే పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర మాట్లాడుతూ.. విద్యార్థులు సంపాదించిన విజ్ఞానం, నైపుణ్యాలు వారి వ్యక్తిగత కెరీర్ అభివృద్ధికే పరిమితం కాకుండా, దేశం, సమాజ ప్రగతికి కూడా దోహదపడాలని ఆకాంక్షించారు.

ఆహార సాంకేతికత, సురక్షితమైన పోషకాహారం, సుస్థిర ఆహార శుద్ధి, ఉత్పత్తులకు అదనపు విలువ జోడించే రంగాల్లో ప్రపంచ నాయకత్వాన్ని సాధించే దిశగా భారత్ ముందుకు సాగేందుకు దోహదపడే విప్లవాత్మక ఆవిష్కరణలు అవసరమని ఆయన పేర్కొన్నారు. నిఫ్టెమ్-కేలో పరిశోధనలను విస్తృతం చేయడం, నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడం, నూతన ఆవిష్కరణలకు అనుకూల వాతావరణాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

నిఫ్టెమ్-కే డైరెక్టర్ డాక్టర్ హరీందర్ సింగ్ ఒబెరాయ్ మాట్లాడుతూ.. విద్యా బోధన, పరిశోధన, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలతో భాగస్వామ్యాల అభివృద్ధిలో సంస్థ గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు.

స్నాతకోత్సవంలో మొత్తం 260 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. వీరిలో 140 మంది బీటెక్, 78 మంది ఎంటెక్, 18 మంది ఎంబీఏ, 24 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారు. విద్యా రంగంలో ప్రతిభ, అంకితభావం కనబరిచిన ఎనిమిది మంది ప్రతిభావంతులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు.

విద్యార్థులకు విద్యార్హతలు అందించడంతోపాటు పరిశోధన, నూతన ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగే నైపుణ్యాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ కల్పించడమే నిఫ్టెమ్-కే లక్ష్యమని డాక్టర్ ఒబెరాయ్ తెలిపారు. తద్వారా ఆహార రంగంలో మారుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు సమర్థంగా స్పందించగలరని పేర్కొన్నారు.

భారత ఆహార రంగంలో అడుగుపెట్టేందుకు నిపుణులకు ఇదే అత్యంత అనుకూల సమయమని రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్. సోధి అన్నారు.

ఆర్థిక మాంద్యం ప్రభావాన్ని తట్టుకునే సామర్థ్యం ఆహార రంగానికి సహజంగా ఎక్కువగా ఉంటుందని డాక్టర్ సోధి అన్నారు. వినియోగదారులు ఇతర అవసరాలకు అంతగా ప్రాధాన్యం లేని వస్తువుల కొనుగోళ్లను వాయిదా వేసుకున్నప్పటికీ, ఆహారం మాత్రం నిత్యావసరంగా కొనసాగుతుందని వివరించారు. 140 కోట్లకు పైగా జనాభా, మారుతున్న ఆహార వినియోగ అలవాట్ల నేపథ్యంలో ఆహార ఉత్పత్తులకు అదనపు విలువ జోడించే రంగంలో భారత్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఆహార పరిశ్రమలో పుట్టుకొస్తున్న అవకాశాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని బికాజీ ఫుడ్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ అగర్వాల్ సూచించారు. ఆహార రంగ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని ఆయన పేర్కొన్నారు.

నిఫ్టెమ్ - కే పాత్ర విద్యాబోధనకే పరిమితం కాదని వక్తలంతా స్పష్టం చేశారు. పరిశోధన, పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వం మధ్య సమన్వయానికి వేదికగా నిలుస్తున్న ఈ సంస్థ.. దేశంలో ఆహార శుద్ధి రంగాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు, భవిష్యత్తు తరాలకు చెందిన ఆవిష్కర్తలు, నిపుణులు, పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా పరిశుభ్రతను పెంపొందించడానికి, పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను తగ్గించడానికి 'ప్రత్యేక క్యాంపెయిన్ 6.0'ను ప్రారంభించిన మంత్రిత్వ శాఖ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10: దేశవ్యాప్తంగా ఉన్న తన 610 కార్యాలయాల భాగస్వామ్యంతో 2026 అక్టోబర్ 2 నుంచి 'ప్రత్యేక క్యాంపెయిన్ 6.0' కార్యక్రమాన్ని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. ప్రభుత్వ కార్యాలయాలలో పరిశుభ్రతను పెంపొందించడం, పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను తగ్గించాలన్న ప్రధాన ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ-వ్యర్థాల సేకరణ, వేరుచేయటం, సక్రమ పద్ధతిలో నిర్వహణపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించారు.

సన్నాహక దశలో లక్ష్యాలను ఖరారు చేయడం, పెండింగ్‌లో ఉన్న సిఫార్సులు లేదా దస్త్రాలను గుర్తించడం, స్థలాన్ని సద్వినియోగం చేసుకోవడంపై ప్రణాళికలు రూపొందించాలని ప్రధాన కార్యాలయంతో పాటు క్షేత్రస్థాయి విభాగాలు, అన్ని మీడియా యూనిట్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

సన్నాహక దశలో కేంద్ర సమాచార ప్రసార శాఖ, రైల్వే శాఖ, ఎలక్ట్రానిక్స్- ఐటీ శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్.. మంత్రిత్వ శాఖ, మీడియా యూనిట్ల సీనియర్ అధికారులతో సమావేశమై చర్చించారు. మంత్రిత్వ శాఖలోని అత్యంత కింది స్థాయి కార్యాలయం వరకు ప్రతి కార్యాలయాన్ని ఈ క్యాంపెయిన్‌లో భాగం చేయాలని ఆయన కోరారు. 2026 అక్టోబర్ 31 తర్వాత కూడా ఈ క్యాంపెయిన్ నిలిచిపోకుండా ఏడాది పొడవునా సాగే నిరంతర కార్యక్రమంగా కొనసాగాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండే కార్యాలయాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, చేసిన మంచి పనులను వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలని ఆయన ఆదేశించారు.

సమాచార ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్, అన్ని మీడియా యూనిట్ల అధిపతులు, వారి నోడల్ అధికారులతో కలిసి ఈ సన్నద్ధతను, అమలును సమీక్షించారు. ఈ ఏడాది కార్యక్రమం కోసం నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి తగిన, సకాలంలో చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

గతంలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లలో ఈ మంత్రిత్వ శాఖ అద్భుతమైన ప్రగతి సాధించింది. 'స్వచ్ఛత'ను వ్యవస్థీకృతం చేయడంలో, పెండింగ్ అంశాలను సకాలంలో పరిష్కరించడంలో తన నిరంతర నిబద్ధతను చాటుకుంది. గత క్యాంపెయిన్‌ల సమయంలో చేసిన ప్రయత్నాలు.. కార్యాలయాల పరిశుభ్రతను మెరుగుపరచడమే కాకుండా ఆదాయాన్ని ఆర్జించడం, స్థల నిర్వహణ, భౌతికంగా ఉండే దస్త్రాల తొలగింపులో గణనీయమైన ఫలితాలను సాధించాయి.

2021లో ప్రత్యేక క్యాంపెయిన్ ప్రారంభమైనప్పటి నుంచి ఈ మంత్రిత్వ శాఖ మొత్తం రూ. 36.20 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ కాలంలో సుమారు 13.89 లక్షల కిలోగ్రాముల చెత్తాచెదారం లేదా పాత సామాగ్రిని తొలగించారు. 13.98 లక్షల చదరపు అడుగుల స్థలం ఖాళీ అయింది. 2.71 లక్షల భౌతిక దస్త్రాలను ఆమోదంతో తొలగించారు. మొత్తం 6,642 బహిరంగ కార్యక్రమాలను నిర్వహించారు. 15,496 ప్రాంతాలు శుభ్రం అయ్యాయి. ఈ విజయాలు, వాటి సంవత్సరాల వారీ వివరాలు ఈ విధంగా ఉన్నాయి:

# దుర్గామాత మాలధారణ పూర్వజన్మ సుకృతం

## కఠోర నియమ నిష్ఠలతో దీక్షను కొనసాగించాలి

## అంబాత్రయ శక్తిపీఠం పీఠాధిపతి శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామిజీ



నిజామాబాద్, అక్టోబర్ 10:దుర్గామాత మాలధారణ చేపట్టడం పూర్వజన్మ సుకృతమని బిజ్వార్ అంబాత్రయ శక్తిపీఠం పీఠాధిపతి శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామిజీ అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత మాలధారణ చేపట్టిన భక్తులు కఠోర నియమ నిష్ఠలతో దీక్షను కొనసాగించాలని సూచించారు.

శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలోని అంబాత్రయ శక్తిపీఠంలో పలువురు భక్తులు శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామిజీ చేతుల మీదుగా దుర్గామాత మాలధారణ దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. దుర్గామాత అనుగ్రహం పొందేందుకు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆరాధించాలని అన్నారు. మాలధారణ చేపట్టిన భక్తులు దీక్షా సమయంలో ఆధ్యాత్మిక చింతనతో గడుపుతూ, పవిత్రతను పాటించాలని సూచించారు. నియమ నిష్ఠలు, క్రమశిక్షణ, భక్తిభావంతో దీక్షను కొనసాగించాలని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో భక్తులందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్నదాత కార్యక్రమం చేపట్టారు.






# వైద్యులు సూచించాల్సిన ఔషధాలపై రిటెయిలర్లు, టోకు వ్యాపారులు ఇస్తున్న వాణిజ్య ప్రకటనలపై నియంత్రణలను కఠినతరం చేయాలని ప్రతిపాదించిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10:వైద్యులు మాత్రమే సూచించాల్సిన ఔషధాలకు సంబంధించిన వాణిజ్య ప్రకటనల నియంత్రణలను బలోపేతం చేయడానికి ఔషధ నియమాలు?1945కు సవరణలను కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రతిపాదించింది. షెడ్యూల్ హెచ్, షెడ్యూల్ హెచ్1, షెడ్యూల్ ఎక్స్ పరిధిలో నిర్దేశించిన ఔషధాలకు సంబంధించిన వాణిజ్య ప్రకటనలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన ముందస్తు అనుమతులను ఔషధాల అమ్మకం, పంపిణీ లైసెన్సులను కలిగి ఉన్న సంస్థలకు సైతం విస్తరించాలని ఈ సవరణ ప్రతిపాదించింది.

డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు (డీటీఏబీ)తో సంప్రదింపుల అనంతరం 2026 సెప్టెంబర్ 28న ప్రచురించిన జీఎస్ఆర్ 861(ఈ) గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ముసాయిదా సవరణను నోటిఫై చేశారు.

ప్రస్తుతం కొనసాగుతున్న నియంత్రణల ప్రకారం షెడ్యూల్ హెచ్, షెడ్యూల్ హెచ్1, షెడ్యూల్ ఎక్స్ పరిధిలోకి వచ్చే ఔషధాలను కేంద్ర ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఫార్మాస్యూటికల్ తయారీదారులు ప్రచారం చేయడం నిషిద్ధం. అయితే ఈ ఔషధాల రిటెయిల్, టోకు అమ్మకాలు, పంపిణీలో భాగస్వామ్యులైన సంస్థలను ఈ నిబంధనల పరిధిలోకి స్పష్టంగా చేర్చలేదు. నియంత్రణాపరమైన ఈ లోపాన్ని పరిష్కరించేందుకు ఔషధ నియమాలు?1945 లోని నియమం?65 లో ఉప నియమం (22)ను చేర్చాలని మంత్రిత్వశాఖ ప్రతిపాదించింది. రిటెయిల్, హోల్‌సేల్ ఔషధ లైసెన్సులను కలిగి ఉన్నవారితో సహా ఔషధాలను అమ్మడానికి, నిల్వ చేయడానికి, పంపిణీ చేయడానికి లేదా అమ్మకం కోసం సరఫరా చేయడానికి లైసెన్సులు ఉన్నవారికి సైతం వాణిజ్య ప్రకటనల నియంత్రణలను విస్తరించాలని ప్రతిపాదించింది.

ప్రతిపాదిత నిబంధన ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి లేకుండా షెడ్యూల్ హెచ్, షెడ్యూల్ హెచ్ 1, షెడ్యూల్ ఎక్స్‌లోని ఔషధాలకు ఎలాంటి వాణిజ్య ప్రకటనలు ఇవ్వరాదు.

ఫార్మాస్యూటికల్ సరఫరా వ్యవస్థలో నియంత్రణాపరమైన పర్యవేక్షణను బలోపేతం చేయడం, ప్రిస్క్రిప్షన్ ఔషధాలకు సంబంధించి అనుమతులు లేని వాణిజ్య ప్రకటనలనూ, సొంత వైద్యంతో ముడిపడి ఉన్న ప్రమాదాలనూ తగ్గించడమే ప్రతిపాదిత సవరణ లక్ష్యం.

కొన్ని యాంటీబయాటిక్‌లు, సైకోట్రోపిక్ ఔషధాలు, వైద్యుని ప్రిస్క్రిప్షన్ మేరకే వాడాల్సిన ఇతర ఔషధాలతో సహా వైద్య పర్యవేక్షణ అవసరమైన మెడిసిన్‌కు సంబంధించిన రక్షణ విధానాలను ఈ చర్య బలోపేతం చేస్తుందని అంచనా.

2026 ఫిబ్రవరి 16న నిర్వహించిన డ్రగ్స్ టెక్నికల్ అడ్వయిజరీ బోర్డు 93వ సమావేశం అందించిన సిఫార్సుల ఆధారంగా ఈ ప్రతిపాదనను తీసుకువచ్చారు. ఔషధాల అమ్మకం, పంపిణీ లైసెన్సులు ఉన్నవారు ఇస్తున్న వాణిజ్య ప్రకటనలకు సంబంధించి తగిన నిబంధనలను తీసుకురావాల్సిన ఆవశ్యకతను ఈ సమావేశం గుర్తించింది.

ముసాయిదా నిబంధనలతో కూడిన గెజిట్ ప్రతులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన తేదీ నుంచి 30 రోజుల్లోగా సంబంధిత నిపుణులు, ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలను మంత్రిత్వశాఖ ఆహ్వానించింది. సవరణను ఖరారు చేయడానికి ముందే నిర్దేశిత కాలపరిమితిలోగా అందిన సమర్పణలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుంది.

# జాబ్ మేళాలో ఇద్దరు యువతులకు ఉద్యోగ అవకాశాలు

## హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీలో ఉద్యోగాలు



నల్గొండ, అక్టోబర్ 10: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో ఇద్దరు నిరుద్యోగ యువతులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బేట అనిల్ తెలిపారు.

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో చిట్యాల మండలానికి చెందిన బుర్ర ఆకాంక్ష, ఏలేటి రామయ్యపల్లి గ్రామానికి చెందిన కొడారి తేజస్వినికి హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీలో ఉద్యోగాలు లభించాయి. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు.

# మన రక్షణ దళాలకు అవసరమైన సాంకేతికత, పరికరాల రూపకల్పన, అభివృద్ధి, తయారీ, నియంత్రణ సామర్థ్యాలపైనే జాతీయ భద్రత ఆధారపడి ఉంది: రాజ్‌నాథ్ సింగ్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10:న్యూ ఢిల్లీలో ఈ రోజు (అక్టోబర్ 9, 2026) జరిగిన సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫాక్చరర్స్ (ఎస్ఐడీఎం-సిడ్మ్) ఎనిమిదో వార్షిక సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2026 సంవత్సరానికి సిడ్మ్ ఛాంపియన్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 15 ఛాంపియన్ అవార్డులను అందజేశారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, ఉత్పత్తుల ఆవిష్కరణ, రూపకల్పన, దిగుమతులకు ప్రత్యామ్నాయంగా దేశీయ ఉత్పత్తుల తయారీ, తయారీ రంగంలో అత్యుత్తమ ప్రతిభ, ఎగుమతుల్లో సాధించిన విజయాలకు గుర్తింపుగా వివిధ సంస్థలకు ఈ అవార్డులు ప్రదానం చేశారు. స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీ, సాంకేతిక ఆవిష్కరణలు, రూపకల్పన సామర్థ్యాల పెంపు, దిగుమతులకు ప్రత్యామ్నాయంగా దేశీయ ఉత్పత్తుల అభివృద్ధి, తయారీ రంగంలో అత్యుత్తమ ప్రతిభ, ఎగుమతుల వృద్ధికి విశేష కృషి చేసిన అవార్డు గ్రహీతలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

'స్వయంసమృద్ధి సామర్థ్యాలు – సవాళ్లతో కూడిన సరిహద్దులు: అనిశ్చితుల నడుమ భారత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని వేగవంతం చేయడం' అనే వార్షిక సమావేశ ఇతివృత్త ప్రాధాన్యాన్ని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. మన రక్షణ దళాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల రూపకల్పన, అభి.వృద్ధి, తయారీ, నియంత్రణ సామర్థ్యాలపైనే జాతీయ భద్రత అంతకంతకూ ఆధార పడుతోందని ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని ప్రతిభావంతులు, యువ శ్రామికశక్తి, పారిశ్రామిక సామర్థ్యాలు, ప్రభుత్వ విధానపరమైన మద్దతు దేశాన్ని ప్రపంచంలోని అగ్రగామి రక్షణ ఉత్పత్తుల తయారీ దేశాల వరసన నిలబెడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

దేశీయ రక్షణ పారిశ్రామిక వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రభుత్వ విధాన రూపకర్తలు, పరిశ్రమల మధ్య చర్చలకు వేదిక కల్పించడంలో సిడ్మ్ పోషిస్తున్న పాత్రను రక్షణ మంత్రి ప్రశంసించారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని పెంచాలని, పరిశోధన - అభివృద్ధిపై పెట్టుబడులను విస్తరించాలని, అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని వేగంగా పెంచే ఏర్పాట్లు చేయాలని, సాంకేతిక ఆవిష్కరణలను వేగవంతం చేయాలని ఆయన భారత రక్షణ పరిశ్రమలకు పిలుపునిచ్చారు. తద్వారా రక్షణ రంగంలో భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, స్వావలంబనను మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. రక్షణ పరికరాల దిగుమతులపై అధికంగా ఆధారపడిన దేశం స్థాయి నుంచి, అత్యాధునిక సైనిక పరికరాలను విశ్వసనీయంగా ఎగుమతి చేసే దేశంగా భారత్ మార్పు చెందడం గణనీయమైన విజయమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ.38,424 కోట్లకు చేరాయని, అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 60 శాతానికి పైగా వృద్ధి నమోదైందని ఆయన తెలిపారు. 2029 నాటికి రక్షణ ఎగుమతులను రూ.50, 000 కోట్లకు చేర్చాలనే లక్ష్యాన్ని ఆయన పునరుద్ఘాటించారు.

ప్రైవేటు రంగ భాగస్వామ్యం ప్రాధాన్యాన్ని ప్రముఖంగా పేర్కొంటూ, భారత రక్షణ ఉత్పత్తిలో ప్రైవేటు రంగం వాటాను ప్రస్తుతమున్న సుమారు 24 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని గతంలో తాను ఇచ్చిన పిలుపును రక్షణ మంత్రి గుర్తు చేశారు. గత 12 ఏళ్లలో రక్షణ రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని ఆయన తెలిపారు. ఈ జాతీయ లక్ష్య సాధనకు పరిశ్రమల ప్రముఖులు ప్రగతిశీల లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

నియంత్రణ, భద్రత, నాణ్యత, జవాబు దారీతనానికి సంబంధించిన ప్రమాణాలను పాటిస్తూనే, ప్రైవేటు రంగం అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

యుద్ధ స్వరూపం మారుతున్న తీరును ప్రస్తావిస్తూ, ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లు, క్షిపణులు, వాయు రక్షణ వ్యవస్థలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్ సాంకేతికతలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రక్షణ మంత్రి పేర్కొన్నారు. "రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు పరిశోధన, అభివృద్ధి కోసం చేసే వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలి.

# మనో వ్యాధులకు మందులు ఉన్నాయి

## - డాక్టర్ ఎల్ వర్షి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు



హైదరాబాద్, అక్టోబర్ 10:ప్రపంచవ్యాప్తంగా గణనీయ సంఖ్యలో మానవాళి మానసిక రుగ్మతల బారినపడి అనారోగ్యాల పాలు అవుతున్నారని, నేడు మానసిక వ్యాధులకు సహితం వైద్యం అందుబాటులోకి వచ్చిం దని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎల్ వర్షి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సుమ ఆసుపత్రి ప్రాంగణంలో శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాటాడుతూ మానసిక ఒత్తిడి, ఆందోళన, భయం, ఒంటరితనం, మాదక ద్రవ్యాల వినియోగం, పని ఒత్తిడి, నిద్రలేమి లాంటి పలు కారణాల మూలంగా మానసిక అనారోగ్యం కలుగుతుందని, త్వరగా గుర్తిస్తే పూర్తి చికిత్స చేయవచ్చని తెలిపారు. ఒక నాడు మనో వ్యాధికి మందు లేదు అనే స్థాయి నుంచి నేడు సరైన సమయంలో సరైన వైద్యులను సంప్రదిస్తే పూర్తి చికిత్స జరుగుతుందని తెలిపారు. మానసిక రుగ్మతను రెండు వారాల్లో గుర్తిస్తే మంచి చికిత్స అందించవచ్చని తెలిపారు. మానసిక వైద్యులను సంప్రదించడానికి పౌర సమాజం వెనుకంజ వేయవద్దని, నేటి వేగవంతమైన జీవనశైలిలో మానసిక రుగ్మతలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని తెలిపారు. మానసిక రుగ్మతలకు కౌన్సిలింగ్, ఔషధ చికిత్స కూడా అవసరం కావచ్చని తెలిపారు. ప్రోగ్రామ్ చైర్మన్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సమస్యగా అవతరిస్తున్న మానసిక సమస్యలు 45 కోట్ల ప్రజలను ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. 14 ఏండ్ల వయస్సు నుంచి 100 ఏండ్ల వృద్ధుల వరకు అందరూ మానసిక రుగ్మతల బారినపడుతున్నారని విచారం వ్యక్తంచేశారు. మానసిక సమస్యల పట్ల కనీస అవగాహన కలిగి ఇరుగుపొరుగు పౌర సమాజానికి తగిన సూచనలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా వర్షిని శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు సముచితంగా సన్మానించారు. ఇదే కార్యక్రమంలో నగర ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ చక్రవర్తుల రమణా చారి జన్మదినం సందర్భంగా కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లయన్ ఎం మహేందర్, లయన్ ఎన్ వేణుగోపాల్, లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, లయన్ ఈ రమేష్, లయన్ కె రాజెందర్ రెడ్డి, లయన్ వి జగదీశ్వరాచారి, లయన్ డా ఎస్ మనోహరాచారి, లయన్ డి తిరుపతి రెడ్డి, లయన్ కె సత్యం, లయన్ పి సురేందర్, ఆనుపత్రి సిబ్బంది, నగర పౌరులు పాల్గొన్నారు.

# నూతన చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



ఆదిలాబాద్, అక్టోబర్ 10:మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సిఫారసు మేరకు చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నూతన పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఈ కమిటీని ఆమోదించారు.

మున్సిపాలిటీ కమిటీ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చౌటుప్పల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నూతన కార్యవర్గం తొలి సమావేశం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీలు ఇప్ప వెంకటేష్, ఎర్రగొని లింగస్వామి, ఉపాధ్యక్షులు అంతటి విజయలక్ష్మి బాలరాజు, బండవిూది మల్లేష్, సయ్యద్ వహిదోద్దీన్, చెరుకు లింగస్వామి, వర్కాల వెంకట్ కుమార్, స్పోక్ పర్సన్ సామకూర యాదయ్య, సెక్రెటరీలు గుండెబోయిన మనిత ఐలయ్య యాదవ్, ఓసు శ్రీజా రాజు, మహమ్మద్ ఫిరోజ్, మట్టుపల్లి యాదగిరి, మాదాని గోపాల్, దోమటి దయాకర్ రెడ్డి, బత్తుల రాజు, జక్కర్తి సుధా, పేరువల్లి సుమతి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణకు 'సేవ్ అవర్ ఓట్స్'

## కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్




సంగారెడ్డి, అక్టోబర్ 10: :(నేటినిజం ప్రతినిధి):ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంగారెడ్డిలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు 'సేవ్ అవర్ ఓట్స్' పేరుతో బ్యాలెట్ బాక్స్ ఉద్యమాన్ని చేపట్టి, ప్రజల నుంచి ఓటు హక్కుల పరిరక్షణకు సంబంధించిన సందేశాలు, వినతులను సేకరించారు. ఓటర్ల పేర్లు, పోలింగ్ బూత్ నంబర్లతో కూడిన సందేశాలను బ్యాలెట్ బాక్స్‌లో వేయడం ద్వారా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ పోరాటానికి సంఘీభావం ప్రకటించేలా కార్యక్రమాన్ని రూపొందించారు.

ప్రజల ఓటు హక్కును కాపాడాలంటూ రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి సంగారెడ్డి ప్రజలు అండగా ఉన్నారనే సందేశాన్ని రాష్ట్రపతికి చేరవేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన ఓటరు కార్డులు, వినతులను రాష్ట్రపతికి పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది కేవలం రాజకీయ అంశం కాదని, ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కులకు సంబంధించిన విషయమని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు హక్కును దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో 73 లక్షల ఓట్లను తొలగించారని, 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇచ్చారని జగ్గారెడ్డి ఆరోపించారు. ఓట్ల చోరీ కారణంగానే బీజేపీ ఎంపీలు గెలుస్తున్నారని, వారి మద్దతుతో నరేంద్ర మోదీ ప్రధానిగా కొనసాగుతున్నారని విమర్శించారు. ఇదే విధానంతో మరోసారి అధికారంలోకి రావాలని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మోదీ, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజల ఓటు హక్కును దెబ్బతీస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి రావడానికి ఓట్లను దొంగిలించే కుట్రలు జరుగుతున్నాయని జగ్గారెడ్డి ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం కీలకమని పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆపబోనని రాహుల్ గాంధీ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఓటు హక్కుల పరిరక్షణ అంశంపై రాహుల్ గాంధీ రాష్ట్రపతిని కలిసి తన అభిప్రాయాలను వెల్లడించారని, ఆయన పోరాటానికి సంఘీభావంగా సంగారెడ్డి నుంచి కూడా వినతులు పంపిస్తున్నామని తెలిపారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడంతో సమానమని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

'సేవ్ అవర్ ఓట్స్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఓటు హక్కుల పట్ల అవగాహన కల్పించడంతో పాటు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో ప్రతి పౌరుడిని భాగస్వామిని చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

ఓటు హక్కుల పరిరక్షణ కోసం తమ నిరసన, పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, సీడీసీ చైర్మన్ గడిల రాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షఫీ హఫీజ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, జార్జ మాథ్యూస్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో డిజిటల్ సేవలు, చివరి వ్యక్తి వరకు పంపిణీని

## బలోపేతం చేస్తున్న భారత తపాలా శాఖ.. ఆర్థిక సేవల విస్తరణ




న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10: అక్టోబర్ 9 ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా నేటి నుంచి ఈ నెల 15 వరకు జాతీయ తపాలా వారోత్సవాలను తపాలా శాఖ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని డాక్ సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (సీపీఎంజీ) శ్రీ డీఎస్‌వీఆర్ మూర్తి మాట్లాడారు. భారత తపాలాశాఖ సాధించిన విజయాలు, సాంకేతిక పురోగతి, పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆయన వివరించారు.

ఈ సందర్భంగా శ్రీ మూర్తి మాట్లాడుతూ.. 1874లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) ఏర్పాటైన సందర్భంగా ప్రపంచ తపాలా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది "ఒకే తపాలా వ్యవస్థ-అపరిమిత అవకాశాలు" అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. తపాలా కార్యాలయాల ద్వారా విస్తృత సేవలను కొనసాగిస్తూనే, ఆధునిక సాంకేతికతతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే సంస్థగా భారత తపాలా శాఖ అభివృద్ధి చెందుతున్న తీరును ఈ నినాదం ప్రతిబింబిస్తుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,49,385 కార్యాలయాలతో సహా మొత్తం 1,64,999 తపాలా కార్యాలయాలతో ప్రపంచంలోనే అతిపెద్ద తపాలా వ్యవస్థను ఇండియా పోస్ట నిర్వహిస్తోందని చెప్పారు. తెలంగాణ సర్కిల్ పరిధిలో 36 ప్రధాన పోస్టాఫీసులు, 759 సబ్ పోస్టాఫీసులు, 5,424 బ్రాంచ్ పోస్టాఫీసులు పనిచేస్తున్నాయని.. ఈ వ్యవస్థలో 6,514 మంది శాఖా ఉద్యోగులు, 10,623 మంది గ్రామీణ డాక్ సేవకులు (జీడీఎస్) భాగస్వామ్యులుగా ఉంటూ.. గ్రామీణ, పట్టణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సేవలను అందిస్తున్నారని ఆయన వివరించారు. ఉపాధి కల్పన గురించి ప్రస్తావిస్తూ.. 17 విడతల రోజ్‌గార్ మేళా ద్వారా తపాలా శాఖ మొత్తం 1,86,202 నియామక ఉత్తర్వులను జారీ చేసిందని, ఇందులో 1,51,348 మంది గ్రామీణ డాక్ సేవకులు ఉన్నారని తెలిపారు. తెలంగాణ సర్కిల్‌లో 1,123 మంది గ్రామీణ డాక్ సేవకులతో సహా మొత్తం 1,272 మంది అభ్యర్థులు ఉద్యోగ నియామకాలను పొందారని ఆయన పేర్కొన్నారు.

జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా యూపీయూ అంతర్జాతీయ లేఖా రచన పోటీ 2026లో తెలంగాణ సర్కిల్ తరఫున విజేతలుగా నిలిచిన వారికి శ్రీ మూర్తి బహుమతులు అందజేశారు. తపాలా శాఖ అందిస్తున్న విభిన్న సేవలు, చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా, కమ్యూనికేషన్లశాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని నాయకత్వంలో తపాలా శాఖ సేవల పంపిణీని మెరుగుపరచడం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి చర్యలు చేపడుతోందని శ్రీ మూర్తి వివరించారు. అదే సమయంలో ప్రజలకు సేవలందించాలనే కీలక బాధ్యతను కూడా కొనసాగిస్తోందని పేర్కొన్నారు. గతంలో ఉత్తరాలు, పోస్టుకార్డుల ద్వారా ద్వారా సమాచారాన్ని చేరవేసే రోజులు ఉండేవని, ప్రస్తుతం ఎస్ఎంఎస్, వాట్సాప్, ఈ-మెయిల్ వంటి ఆధునిక మార్గాలు అందుబాటులోకి వచ్చాయని శ్రీ మూర్తి గుర్తుచేశారు. సమాచార అనుసంధానంలో సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో మార్పులు తీసుకొచ్చినప్పటికీ, వ్యక్తుల మధ్య వ్యక్తిగత అనుబంధాలకు ఉన్న విలువ మాత్రం అలాగే కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. మారుతున్న సమాచార అవసరాలకు అనుగుణంగా భారత తపాలాశాఖ తన సేవలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూనే.. ప్రజలను అనుసంధానించడం, వారికి అవసరమైన సేవలను అందించడం అనే తన దీర్ఘకాలిక లక్ష్యానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

డిజిటల్ గా వచ్చిన మార్పుల గురించి చెబుతూ... స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన సాంకేతిక వేదిక అయిన ఏపీటీ 2.0 ప్రారంభం కావడం ఓ ముఖ్యమైన విజయమని అన్నారు. ఐఐటీ హైదరాబాద్, ఇస్రోకు చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) సహకారంతో అభివృద్ధి చేసిన డిజిపిన్ (డిజిటల్ పోస్టల్ ఇండెక్స్ నంబర్)... ప్రామాణికమైన 10 అక్షరాలతో కూడిన జియో?కోడెడ్ ఆధారిత డిజిటల్ చిరునామా నిర్దేశాన్ని అందిస్తుంది. బట్వాడా సేవల గురించి శ్రీ మూర్తి వివరిస్తూ... డోర్ స్టెప్ సర్వీస్ (డీఎస్ఎస్) అప్లికేషన్ ద్వారా డెలివరీలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయవచ్చని తెలిపారు. 2026 మార్చి 17న హైదరాబాద్‌లో 24 స్పీడ్ పోస్ట్, 48 స్పీడ్ పోస్ట్ సేవలు ప్రారంభమయ్యాయి. వీటి ద్వారా 1.33 లక్షలకు పైగా వస్తువులు నమోదయ్యాయని వెల్లడించారు. 94 పిన్ కోడ్ ప్రాంతాలకు నిర్దిష్ట సమయంలో డెలివరీ అందిస్తున్నామని పేర్కొన్నారు. పోస్టాఫీసు కౌంటర్లలో యూపీఐ, కార్డు చెల్లింపుల సౌకర్యం కూడా అందుబాటులో ఉందని, డీఎస్ఎస్ అప్లికేషన్ ద్వారా 'క్యాష్ ఆన్ డెలివరీ (సీవోడీ)' విధానంలో సేవల్ని అందిస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణలో 14 పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు ఉన్నాయని తెలియజేశారు. ఇవి ఆర్థిక సంవత్సరం 2025-26లో 1,66,478 పాస్‌పోర్ట్ లావాదేవీలను, 2026 సెప్టెంబర్ వరకు మరో 87,100 లావాదేవీలను నిర్వహించాయని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 263 ఆధార్ కేంద్రాలు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 4,75,592 లావాదేవీలను, 2026 సెప్టెంబర్ వరకు మరో 3,17,146 లావాదేవీలను నమోదు చేశాయి. తపాలా వ్యవస్థ ద్వారా నెలకు సుమారు 20 లక్షల మంది లబ్ధిదారులు చేయూత పింఛన్లను పొందుతుండగా, నెలకు దాదాపు -500 కోట్ల పంపిణీ జరుగుతోంది. ఉప తపాలా కార్యాలయాల ద్వారా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) రుణ చెల్లింపుల సేకరణలో స్త్రీనిధికి కూడా తపాలా శాఖ సహకరిస్తోంది. 'హోలీ బ్లెస్సింగ్' చొరవ ద్వారా వేలాది ప్రసాదం పార్శిళ్లను నేరుగా భక్తుల ఇళ్ల వద్దకే చేరవేసింది.

ఆర్థిక సమ్మిళితత్వం గురించి శ్రీ మూర్తి ప్రత్యేకంగా వివరించారు. 2026 మార్చి 31 నాటికి తెలంగాణ పోస్టల్ సర్కిల్ పరిధిలో 1.07 కోట్ల లైవ్ పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ (పీవోఎస్బీ) ఖాతాలు ఉన్నాయని తెలిపారు. తపాలా ఆర్థిక సేవల ద్వారా 2026?27 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి తెలంగాణ గ్రామీణ జనాభాలో 25 శాతం మందిని ఆర్థిక సమ్మిళితత్వం పరిధిలోకి తీసుకురావాలని ఈ సర్కిల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే ఆర్థిక సంవత్సరంలో కనీసం 10 శాతం పీవోఎస్బీ ఖాతాలను డిజిటల్ లావాదేవీల దిశగా మళ్లించాలని యోచిస్తోంది. వినియోగదారుల సౌలభ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ లాంటి డిజిటల్ సదుపాయాలను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నారు.

పోస్టల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ (పీఎల్ఐ), రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ (ఆర్‌పీఎల్ఐ) పథకాలు పౌరులకు బీమా రక్షణను అందిస్తున్నాయని ఆయన తెలియజేశారు. పీఎల్ఐ పరిధిని ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా నిపుణులు, పట్టభద్రులకు కూడా విస్తరించగా, ఆర్పీఎల్ఐని పట్టణ ప్రాంత ప్రజలకు సైతం అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ సర్కిల్ 71, 233 కొత్త పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ పాలసీలను విక్రయించింది. వాటి ద్వారా రూ. 590.13 కోట్ల ప్రీమియం వసూలు చేసిందని వివరించారు. సర్కిల్ ఆర్థిక పనితీరును వెల్లడిస్తూ... 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.661.88 కోట్ల లక్ష్యానికి గాను తెలంగాణ సర్కిల్ రూ.596.71 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2026 సెప్టెంబర్ నాటికి రూ.322.28 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసిందని శ్రీ మూర్తి తెలిపారు.

# అక్టోబర్‌లో విద్యుత్ కేంద్రాలకు వేగంగా బొగ్గు సరఫరా

న్యూఢిల్లీ, అక్టోబర్ 10:విద్యుత్ ప్లాంట్ల వద్ద బొగ్గు నిల్వలు కనిష్ఠ స్థాయిలకు పడిపోవడంతో భారతదేశంలో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం పెరుగుతోందంటూ ఇటీవలి కాలంలో మీడియా కథనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బొగ్గు మంత్రిత్వ దిగువ పేర్కొన్న విషయాలను స్పష్టం చేస్తోంది.

"క్రిటికల్ స్టాక్" అనే ట్యాగ్ ప్రమాణ ఆధారితమైన సూచిక (నిర్దేశించిన ప్రామాణిక నిల్వ పరిమితి కంటే తక్కువ నిల్వను కలిగి ఉండటం). అయితే వాస్తవ ఇంధన కొరత లేదా ఉత్పత్తి నష్టం ఏర్పడటానికి చాలా ముందుగానే విద్యుత్ కేంద్రాలను హెచ్చరించడానికి ఈ విధానాన్ని రూపొందించారు. దీని ప్రకారం, ఈ జాబితాలో ఏదైనా విద్యుత్ కేంద్రం పేరు కనిపిస్తే.. అది ముందస్తు హెచ్చరిక మాత్రమే. ఆ కేంద్రంలో బొగ్గు అయిపోయిందని లేదా తక్షణమే మూసివేత ప్రమాదంలో ఉందని సూచించే సంకేతం ఏమాత్రం కాదు.

సెప్టెంబర్‌లో సరఫరాలు కనిష్ఠ స్థాయికి పడిపోయిన తర్వాత ఎంతమేరకు మెరుగుపడ్డాయనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుని బొగ్గు నిల్వల పరిస్థితిని అంచనా వేయాలి. సెప్టెంబరులో నమోదయిన కనిష్ఠ స్థాయిలతో పోలిస్తే విద్యుత్ రంగానికి రోజువారీ సరఫరాలు దాదాపు 36 శాతం పెరిగాయి. అలాగే సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్ సగటు సరఫరా సుమారు 9 శాతం ఎక్కువగా నమోదైంది. నిల్వలు తరిగిపోయే వేగం కూడా గణనీయంగా మందగించింది (చిత్రం 1). దీనికి అనుగుణంగా రైలు లోడింగ్ వేగం పుంజుకుంది. అక్టోబర్‌లో రోజుకు సగటున 465 ర్యాక్‌లకు పైగా లోడింగ్ జరిగింది. వరుసగా మూడు రోజుల్లోనే నిర్దేశిత 470 ర్యాక్‌ల లక్ష్యాన్ని చేరుకున్నారు (చిత్రం 2). రోడ్డు మార్గంతో సహా ఇతర రవాణా మార్గాల ద్వారా కూడా బొగ్గు సరఫరా మెరుగయింది.

నిల్వలు తరిగిపోయే వేగం గణనీయంగా తగ్గింది. రోజువారీ నిల్వల వినియోగం సెప్టెంబర్‌లో రోజుకు 0.243 మిలియన్ టన్నులు ఉండగా, అక్టోబర్‌లో అది రోజుకు 0.116 మిలియన్ టన్నులకు, అంటే సగానికి పైగా తగ్గింది. నిల్వల పునరుద్ధరణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కానప్పటికీ, పరిస్థితి నిలకడగా మారుతోంది.

బొగ్గు నిల్వలు క్లిష్టమైన స్థాయి పడిపోయిన విద్యుత్ కేంద్రాల పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా తగినంత సరఫరా జరిగేలా, నిల్వలు తక్కువగా ఉన్న కేంద్రాలకు వాటి అవసరాలకు తగినట్లుగా బొగ్గును పునఃపంపిణీ చేస్తున్నారు. వర్షాకాలం చివరి దశకు చేరుకోవడం, అక్టోబర్ మధ్యమం నాటికి గరిష్ఠ విద్యుత్ డిమాండ్ తగ్గుముఖం పట్టే అవకాశం ఉండటంతో (మునుపటి ధోరణుల ప్రకారం) రోజుకు 465 నుంచి 475 ర్యాక్‌ల చొప్పున లోడింగ్‌ను కొనసాగించడం వల్ల పరిస్థితి మరింత మెరుగుపడుతుంది.

# 23 నుంచి కరువు సమస్యపై బీజేపీ పాదయాత్ర

ఆదిలాబాద్, అక్టోబర్ 10: వర్షాభావ తీవ్రత నేపథ్యంలో రైతులు సంక్షోభంలో చిక్కుకున్నారని, ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని బీజేపీ ఎంపీ గొడెం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా విద్యుత్ సంక్షోభం నెలకొందని, పంటలను కాపాడుకునేందుకు రైతులు అపసోపాలు పడుతున్నారని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం థర్మల్ పవర్ ప్రాజెక్టుకు బొగ్గు సరఫరా నిలిపివేయడంతో విద్యుత్ కొరత నెలకొందని అన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ జిల్లాలో పంట దిగుబడి రాక వారం రోజుల్లో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వ్యవసాయ రంగం సంక్షోభంలో చిక్కుకుందని అన్నారు. అప్పుల బాధల్లో ఉన్న రైతులను ఆదుకోవాలనీ డిమాండ్ చేశారు. రైతుల పంట రుణాలు మాఫీ చేసి, కరువు జిల్లాగా ప్రకటించాలని, ఫసల్ బీమా పథకాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈనెల 23 నుంచి ఆదిలాబాద్ నుంచి జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్ వరకు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. ఈ పాద యాత్రలో 20 వేల మంది రైతు లను సమీకరిస్తామని తెలిపారు. రైతాంగ సమస్యలపై ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనా రాయణ, బిజెపి జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానంద, కిసాన్ మో ర్చా జిల్లా అధ్యక్షులు కటకం రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## చాయ్‌వాలా సుధాకర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

నిజామాబాద్, అక్టోబర్ 10:ఇటీవల మృతి చెందిన చాయ్‌వాలా పొలాస సుధాకర్ కుటుం బానికి లిటిల్ ఫ్లవర్ పాఠశాల యజమాని డాక్టర్ షఫీ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. సుధాకర్ నివాసానికి వెళ్లిన డాక్టర్ షఫీ, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుని భార్యకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

# బాలికల హక్కుల పరిరక్షణకు సమాజం సన్నద్ధం కావాలి

## అక్టోబర్ 11...అంతర్జాతీయ బాలికా దినోత్సవం




అంతర్జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 11న నిర్వహించ బడుతోంది. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది.

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కెనడా తన తీర్మానంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని అధికారికంగా ప్రతిపాదించింది. కెనడా మహిళామంత్రి రోనా అంబ్రోస్ ఈ తీర్మానాన్ని స్పాన్సర్ చేసింది; 2011, డిసెంబరు 19న జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2012, అక్టోబరు 11న తొలి అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఆమోదించే తీర్మానానికి ఓట్లు వేయగా, అధికారికంగా బాలికా దినోత్సవం గుర్తించబడిందిని తీర్మానం పేర్కొంది.

అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త ఎలానార్ రూజ్‌వెల్ట్, 192 దేశాలు సంతకం చేసిన మానవ హక్కుల ప్రకటనలో స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబించేలా మ్యాన్ అన్న పదాన్ని పీపుల్‌గా మార్చింది. మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలానార్ రూజ్‌వెల్ట్ పుట్టిన రోజైన అక్టోబరు 11ను అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి గుర్తించింది. 2012, అక్టోబరు 11న తొలిసారిగా ఈ దినోత్సవం జరుపబడింది. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియ చేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కరించ బడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడుతున్నది. సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యలు గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపు కుంటారు. బాలిక శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వాషింగ్టన్ లోని యునైటెడ్ స్టేట్స్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ 2014లో అందించిన వివరాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 62 మిలియన్లకు పైగా బాలికలకు విద్య అందడంలేదు. ప్రపంచవ్యాప్తంగా 5 నుండి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలు, అదే వయస్సు గల అబ్బాయిల కంటే 160 మిలియన్ గంటలకుపైగా ఇంటి పనుల కోసం తమ సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా, నలుగురిలో బాలికల్లో ఒకరికి 18 ఏళ్ళకంటే ముందుగానే వివాహం జరుగుతోంది. 2016, అక్టోబరు 11న, ఐక్యరాజ్యసమితి వుమెన్ గుడ్‌విల్ అంబాసిడర్ ఎమ్మా వాట్సన్, బలవంతపు బాల్య వివాహాలను అంతం చేయాలని ప్రపంచ దేశాలను, కుటుంబాలను కోరింది.

చైనా మొదలు అమెరికాతో సహా ఆధునికత వైపు అడుగులు వేస్తున్న భారత్‌లోనూ అమ్మాయిల పట్ల వివక్ష ఉంటుందని గ్లోబల్ ఎర్లీ అడల్సెంట్ స్టడీ పేరిట నిర్వహించిన ఒక అధ్యయనంలో భాగంగా... అమ్మాయిలు పదహారేళ్ల వయసుకు చేరుకున్నప్పటికీ మానసిక ఒత్తిడికి గురవు తున్నారని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాన్‌హాప్‌కిన్స్ బ్లూమ్ బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కిడ్స్ సంయుక్తంగా 15 దేశాల్లో నిర్వహించిన సర్వేలో అమ్మాయిలు శారీరకంగా బలహీనులనే విషయం... చిన్న వయసులోనే ముద్ర పడేలా చేయడంలో తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తేలింది.

బాలికల కంటే అబ్బాయిలకే ఎక్కువ ప్రాధాన్యత అధికంగా ఇవ్వడం సర్వత్రా వ్యక్తమవు తున్నది. ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఉంది.

ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల్లో నలభై శాతంకి పైగా భారత్‌లోనే జరుగు తున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ స్పష్టం చేసింది. బాలికల ఉన్నత విద్య మరో సమస్యగా మారింది, ఇప్పటికి అధిక రాష్ట్రాల్లో 40%నికి పైగా పదో తరగతి కంటే ముందే బడి మాని వేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేసినా ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ తగ్గడంలేదు. బాల్య వివాహం కారణంగా రాష్ట్రంలోని 28 శాతం మంది బాలికలకు పద్దెనిమిది సంవత్సరంలోపే వివాహాలు చేస్తున్నారు. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్య నివేదిక ప్రకారం భారత దేశంలో వయోజన నిరక్షరాస్యులలో మహిళలు 68 శాతం వున్నారు. పంతొమ్మిది ఏళ్లు నిండక ముందే దాంపత్య జీవితంలో అడుగు పెడుతున్నారు. బాలికల సంఖ్య 41 శాతం అని జనగణనలో తేలింది. బాల్య వివాహాలు, పాఠశాలలు చేరువ, అందుబాటులో పూర్తి స్థాయిలో లేకపోవడం, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత, లైంగిక విచక్షణ వంటి సమస్యలు భారతావనిలో బాలిక విద్యకు శాపంగా పరిణ మించింది. పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు డెబ్బై శాతం అన్న అంచనాలు తీవ్రంగా కలవర పరుస్తున్నాయి. మహిళా కార్మిక శక్తి, వారి ఆదాయం, అక్షరాస్యాత స్థాయి, జననాల విషయం, తదితర అంశాల్లో అధమస్థాయిలో వున్న 20 దేశాల్లో మన దేశం ఒకటి కావడం ఆందోళనకర అంశం. మహిళలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదు. ఆడపిల్లలు ప్రతి రంగంలో, చదువులో మొదలుకుని ఆటల దాకా, రాణిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నారు.

బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్' పేరుతో ఓ కార్యక్రమం తెచ్చింది. బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోంది. 2008 నుంచీ దీన్ని ఏటా నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ, వాళ్ల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై ఈ రోజున అవగాహన కల్పిస్తోంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక... "బేటీ బచావో బేటీ పడావో" స్కీం తెచ్చారు. తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు.

నేడు మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం నిత్యం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మైనర్లపై అత్యాచారాలు ఆగడంలేదు. సమాజంలో అమ్మాయిలు, మహిళలకు రక్షణ కరువ వుతున్నది. ఎంతోమంది ఆడ పిల్లలు ఈ లోకంలో అడుగుపెట్టక ముందే బలవంతపు మరణాలకు బలవు తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మానవతా విలువలు మాత్రం పెరగడం లేదు. దానికి నిదర్శనం భ్రూణ హత్యలు. గర్భస్త శిశువుల లింగ నిర్ధారణను నిషేధించి తద్వారా ఆడపిల్లల భ్రూణ హత్యలు నివారణ కోసం 1994లోనే చట్టం తెచ్చినా అది ఏనాడూ పకడ్బందీగా అమలైన జాడలు లేవు.

సమాజంలో చైతన్యం నింపాలంటే ముందు మహిళ జాగృతం కావాలి. స్త్రీ కళ్లు తెరిస్తే కుటుంబం, దానితో పాటు గ్రామం, రాష్ట్రం, దేశం పురోగతి బాట పడతాయి' అని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గతంలో చేసిన వ్యాఖ్యలు గుర్తుంచు కోవాలి. కౌమారదశలో ఆడపిల్లలు, యువతులు ఎదుర్కొనే వివిధ రకాల హింసను అంతం చేయాలి.

బాలికలు వారి చట్టపరమైన హక్కులు మరియు జీవిత వాస్తవాలను గురించి తెలుసు కోవాలి. వారు మంచి విద్య, పోషణ, ఆరోగ్య సంరక్షణ హక్కులను కలిగి ఉంటారని అవగాహన కల్పించాలి. గృహ హింస చట్టం 2009, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 నిషేధించడం మరియు కట్న నిషేధ చట్టం 2006 వంటి చట్టాల గురించి వారి సరైన హక్కులు పొందడానికి మరియు జీవితంలో అన్ని సవాళ్లను ఎదురుకొని ముందుకు వెళ్ళాలి. బాలికలపట్ల వివక్ష, అసమానత, చిన్నచూపు, లైంగిక వేదింపులు, అత్యాచారాల నుండి రక్షించడానికి కుటుంబం, మిత్రులు, సమాజం సన్నద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

## అప్పాజీ పాత్ర చిరస్మరణీయం!

### నవలా చక్రవర్తి ముదిగొండ శివప్రసాద్‌గారికి అశ్రునివాళి

చరిత్రకు జీవం పోసిన కలం...
తెలుగు సాహిత్యానికి వెలుగునిచ్చిన జ్ఞానం...
రాజుల వైభవాన్ని అక్షరాల్లో ఆవిష్కరించిన మహనీయుడు...
ముదిగొండ శివప్రసాద్‌గారు .. మీకు మా అశ్రునివాళి!

మీరు లేరనే మాట మనసును కలచివేస్తోంది, మీ జ్ఞాపకం కన్నీటిని తెప్పిస్తోంది

కానీ మీరు పోషించిన పాత్రలు, మీరు సృష్టించిన సాహిత్యం మిమ్మల్ని మా హృదయాల్లో సజీవంగా నిలబెడుతున్నారు!

2013 నవంబరు... ప్రపంచ తెలుగు మహాసభలు...

"జయహో శ్రీకృష్ణదేవరాయ" నృత్యరూపకం.. మా కుటుంబానికి మరపురాని మధురస్మృతి!

విజయబాబుగారి రచన సహకారంతో చరిత్ర వేదికపై కళారూపం దాల్చిన వేళ, మా కౌశిక్‌బాబు శ్రీకృష్ణదేవరాయలుగా, మా శృతకీర్తి గోదాదేవిగా నర్తించగా, అప్పాజీగా మీరు అభినయించి ఆ ప్రదర్శనకు ప్రత్యేక శోభను చేకూర్చారు!

రాజనీతి తెలిసిన మంత్రిగా, వివేకానికి ప్రతిరూపంగా, మీరు ప్రదర్శించిన అభినయం ఆ పాత్రకు ప్రాణం పోసింది!

అప్పాజీగా మీరు కనిపించిన ఆ రూపం, మీరు పలికించిన ఆ పాత్రాభినయం, మా జ్ఞాపకాలలో చెరిగిపోని ముద్ర!

అప్పట్లో తెలుగు అధికార భాషా సంఘం చైర్మన్గారి వద్ద పి.ఎస్.గా పనిచేస్తున్నాను, ఆ అపురూప కళా సాహిత్య సమ్మేళనానికి సాక్షిగా నిలిచాను. నాడు ఏర్పడిన ఆత్మీయ పరిచయం నేడు కన్నీటి జ్ఞాపకమై మిగిలింది; కళతో మొదలైన అనుబంధం మనసులో చెరగని బంధమై నిలిచింది!

మీ అర్ధాంగి ముందుగానే దూరమయ్యారు, నేడు మీరూ మమ్మల్ని విడిచి వెళ్లారు; కాలం మీ భౌతిక సాన్నిధ్యాన్ని దూరం చేసినా, మీ జ్ఞాపకాలను మాత్రం చెరపలేకపోతుంది!

మీ సాహిత్యం తెలుగు జాతికి సంపద, మీ సేవ భావితరాలకు స్ఫూర్తి, మీ అప్పాజీ పాత్ర రంగస్థలానికి జ్ఞాపకం, మీ వ్యక్తిత్వం మా కుటుంబానికి ఆత్మీయ అనుబంధం! వ

ముదిగొండ శివప్రసాద్‌గారూ! మీకు మా హృదయపూర్వక అశ్రునివాళి! మీ సాహిత్యసేవకు అక్షరాంజలి!

మీ కళాత్మక ప్రతిభకు వినమ్ర వందనం! మీరు పోషించిన అప్పాజీ పాత్ర చిరస్మరణీయం... మీ స్మృతి మా హృదయాల్లో సజీవం... మీ సాహిత్యకీర్తి తెలుగు నేలపై అజరామరం!



-శారద శృంగేరి
9490261119

## 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్..

### ప్రభుత్వ విధానాలపై ఓ కథనాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధాని

న్యూఢిల్లీ, అక్టోబర్ 10:ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తా రాసిన ఓ వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు ప్రజలతో పంచుకున్నారు.

ప్రజా జీవితంలో ప్రధాని శ్రీ మోదీ పూర్తి చేసుకున్న 25 సంవత్సరాల ప్రస్థానం, నేటి అవసరాలను తీర్చేందుకు సేవ, భవిష్యత్తు ఆకాంక్షల నెరవేర్చేందుకు సంకల్పానికి కట్టుబడి ఉండటాన్ని ప్రతిబింబిస్తుందని ఈవ్యాసం తెలియజేస్తుంది.

ఢిల్లీ పాలనకు సంబంధించిన పాలనాంశాలను ప్రస్తావిస్తూ... ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, అభివృద్ధి చెందిన ఢిల్లీని నిర్మించడమే తమ లక్ష్యమని శ్రీమతి రేఖా గుప్తా పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047 జాతీయ లక్ష్య సాధనలో ఢిల్లీ తన వంతు సహకారం అందించేలా చేయడమే తమ ధ్యేయమని తెలిపారు.

సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి ఈ విధంగా పేర్కొన్నారు.

"ప్రజా జీవితంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రస్థానం.. నేటి అవసరాలకు సేవ, రేపటి ఆకాంక్షల సాధనకు సంకల్పం అనే అంశాలను ప్రతిబింబిస్తుందని ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తా తన వ్యాసంలో పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను చివరి లబ్ధిదారుని వరకు చేర్చడం నుంచి విద్య, ఆరోగ్య సంరక్షణ, నైపుణ్యాలను మెరుగుపరచడం వరకు ఢిల్లీ పాలనకు సంబంధించిన పానాపరమైన అంశాలను ఆమె ప్రస్తావించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో కీలక భాగంగా వికసిత్ ఢిల్లీని నిర్మించడమే లక్ష్యం"

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు



అమరావతి, అక్టోబర్ 10:: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వేగవంతంగా చర్యలు తీసుకుంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శనివారం జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్లు ఖరారుకు ఆమోద ముద్ర వేసింది. మొత్తం 8 కేటగిరిల్లో రిజర్వేషన్లను ఖరారు చేసింది.

పంచాయతీ వార్డు మెంబర్స్‌లో బీసీలకు 26.73 శాతం, సర్పంచు స్థానాలకు బీసీలకు 27.95 శాతం, ఎంపీటీసీ స్థానాలకు బీసీలకు 25.55 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రివర్గ సమావేశం తీర్మానించింది. ఎంపీపీలో బీసీలకు 24.60 శాతం, జడ్పీటీసీ 24.60 శాతం, జడ్పీ చైర్మన్ 23.08, అర్బన్ వార్డుల్లో 32.78 శాతం, మున్సిపల్ చైర్మన్లలలో 33.02 శాతం మేర బీసీలకు రిజర్వేషన్లు , మేయర్లలో 35.29 శాతం రిజర్వేషన్లను ఏపీ కేబినెట్ ఖరారు చేసింది.

## 48వ వరల్డ్ స్కిల్స్ - టీమిండియాతో ప్రధాని భేటీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10:షాంఘైలో నిర్వహించిన 'వరల్డ్ స్కిల్స్ కాంపిటీషన్ - 2026'లో పాల్గొంటున్న టీమిండియా ప్రతినిధులతో 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సమావేశమయ్యారు.

పోటీలో తమ అనుభవాలను ఈ సందర్భంగా ప్రతినిధులు పంచుకున్నారు. ప్రపంచ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించడం తమకెంతో గర్వకారణమన్నారు. అంతర్జాతీయ పోటీ సమయంలో సరికొత్త పరికరాలు, సాఫ్ట్‌వేర్, సాంకేతిక వ్యవస్థలు, పని విధానాలను సానుకూలంగా మలచుకున్న తీరుపై వారు చర్చించారు. నైపుణ్యాభివృద్ధి దిశగా ప్రభుత్వ చర్యలు యువతకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వారు పేర్కొన్నారు.

అంతర్జాతీయ వేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన వారికి ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. నైపుణ్యాభివృద్ధికి ప్రతినిధులుగా నిలవాలని ఆయన వారిని కోరారు. విద్యాపరమైన డిగ్రీల మాదిరిగానే ఆచరణాత్మక నైపుణ్యాలు కూడా అత్యంత కీలకమైనవన్నారు.

ప్రత్యేక నైపుణ్యాల ప్రాధాన్యాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. సాంకేతికత వేగంగా మారుతున్న తరుణంలో.. యువత నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. నూతన సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని కోరారు. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు తగినట్లుగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తమ అనుభవాలు, సూచనల ద్వారా దేశీయ నైపుణ్య శిక్షణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిపుణులైన మానవ వనరుల అంతర్జాతీయ నిలయంగా భారత్‌ను నిలిపే దిశగా యువత, ప్రభుత్వం, శిక్షణ సంస్థలు సమన్వయంతో పనిచేయడం అత్యావశ్యకమన్నారు.

నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయడం వెనుక ఉన్న లక్ష్యాన్ని ప్రధానమంత్రి వివరించారు. నైపుణ్య శిక్షణ సంస్థలు.. ఐఐటీలు, ఐఐఎంలకు ఏమాత్రం తీసిపోవని ఆయన వ్యాఖ్యానించారు. తమ అనుభవాలను, సూచనలను ప్రభుత్వంతో పంచుకోవడం ద్వారా.. దేశ నైపుణ్య శిక్షణ వ్యవస్థను మెరుగుపరచడంలో తోడ్పాటునందించాలని ప్రతినిధులను శ్రీ మోదీ కోరారు.

## శ్రీవారికి బంగారు లాకెట్, ముత్యాలహారం విరాళం



తిరుపతి, అక్టోబర్ 10:జైపూర్ కు చెందిన ఆర్తి బిందాల్ దంపతులు తిరుమల శ్రీవారికి శనివారం రూ.51.55 లక్షలు విలువైన 174 గ్రాముల బంగారు లాకెట్ , ముత్యాల హారాన్ని విరాళంగా అందించారు. వీటిలో రూ.44.35 లక్షలు విలువైన వజ్రాలు, రత్నాలు పొదిగిన 147 గ్రాముల బంగారు లాకెట్, రూ.7.20 లక్షలు విలువైన వజ్రాలు, కెంపులు పొదిగిన 27 గ్రాముల మూడు వరుసల ముత్యాల హారాలు ఉన్నాయి. ఈ మేరకు దాత తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు ఆభరణాలను అందజేశారు.

టీటీడీకి రూ.10 లక్షలు విరాళం

తిరుపతికి చెందిన విష్ణు ప్రసాద్ అనే భక్తుడు టీటీడీ శ్రీ వెంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్ కు రూ.10,01,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

టీటీడీ వైద్యశాలలకు రూ.18 లక్షల విలువైన ఔషధాల విరాళం

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హైదరాబాద్ కు చెందిన ఎస్‌ఎస్కే ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ ప్రొప్రైటర్ జి. శ్రవణ్ కుమార్ రూ.15 లక్షల విలువైన ఔషధాలను, ఇందు డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత తలశిల వెంకటేశ్వరరావు రూ.3 లక్షల విలువైన ఔషధాలను శనివారం విరాళంగా అందించారు. టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు శనివారం తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బి.ఆర్. నాయుడును కలిసి దాతల తరపున ఔషధాలను అందజేశారు.

## చిన్న జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు చేరువైన పాలన : మాజీ ఎమ్మెల్యే గండ్ర



వరంగల్, అక్టోబర్ 10:కేసీఆర్ ఆలోచనల నుంచి పురుడు పూసుకున్న చిన్న జిల్లాల ఏర్పాటుతో జిల్లా ప్రజలకు పాలన చేరువైందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆవిర్భవించి పదేండ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి మెడికల్ కళాశాల మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు 500 బైక్ లతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం జిల్లా కలెక్టరేట్ ఎదుట కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, అన్ని జిల్లా శాఖల కార్యాలయాలు జిల్లా కేంద్రంలో ఏర్పడడం వల్ల ప్రజలకు ఎంతగానో మేలు జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

## అహ్మదాబాద్ క్రీడల్లో బ్రిక్స్ దేశాల సంప్రదాయ, స్వదేశీ క్రీడలు, సాంస్కృతిక వారసత్వ ప్రదర్శన

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10:బ్రిక్స్ భారత అధ్యక్షతన అక్టోబర్ 12, 2026న అహ్మదాబాద్‌లోని వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బ్రిక్స్ సంప్రదాయ, స్వదేశీ క్రీడల ప్రదర్శన-2026 జరుగుతుంది. గుజరాత్ ప్రభుత్వంతో కలిసి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ దీన్ని నిర్వహిస్తుంది.

ఈ కార్యక్రమాన్ని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభిస్తారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు గుజరాత్ ఉప ముఖ్యమంత్రి శ్రీ హర్ష్ సంఘ్వీ, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ సహాయమంత్రి శ్రీమతి రక్షా నిఖిల్ ఖడ్సే, గుజరాత్ క్రీడా శాఖ సహాయమంత్రి డాక్టర్ జైరామ్ గామిత్ ముఖ్య అతిథులుగా హాజరవుతారు.

ఈ క్రీడలు బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులను ఒకచోట చేర్చి, సంప్రదాయ, స్వదేశీ క్రీడా విధానాలను ప్రదర్శిస్తాయి. క్రీడల ద్వారా సాంస్కృతిక మార్పిడి, వారసత్వ పరిరక్షణ ప్రజల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయి.

పోటీతత్వం లేని వేదికగా రూపుదిద్దుకున్న ఈ క్రీడలు... సాంస్కృతిక ప్రాముఖ్యత, క్రీడాకారుల మధ్య పరస్పర సంబంధాలు, జ్ఞానాన్ని పంచుకునేందుకు ప్రాధాన్యతనిస్తాయి. సంప్రదాయ క్రీడా పద్ధతుల ప్రదర్శన, డాక్యుమెంటేషన్, అనుభవాల మార్పిడిపై దృష్టి సారిస్తాయి.

ఈ కార్యక్రమంలో పాల్గొనే దేశాలు వైవిధ్యమైన సంప్రదాయ, స్వదేశీ క్రీడలను, సాంస్కృతిక ఆచారాలను ప్రదర్శిస్తాయి:

బెలారస్: గోరోడ్కి బొలీవియా: లుచా డి చోలిటాస్, టింకు, రాయులా, ట్రోంపో, కాచినస్, కరెరా డి సాకోస్

బ్రెజిల్: జరాబటానా (స్వదేశీ బ్లోపైప్), కొరిడా డి టోరాస్ (లాగ్ రేస్), బ్రెజిలియన్ పారా-జియు-జిట్సు, కపోయిరా చైనా: వుషు, లయన్ డ్యాన్స్, హెల్త్ కిగాంగ్

ఇథియోపియా: ఇథియోపియన్ రెజ్లింగ్ (టెగెల్), ఇథియోపియన్ జెనా (ఫీల్డ్ హాకీ), సెలస్ గెబెటా/18-12/బుబే/షాహే

భారతదేశం: మల్లఖాంబ్, యోగాసనం, కలరిపయట్టు ఇరాన్: జోర్ఖానా, హఫ్త్ సాంగ్, ఘనీహ్ కజకిస్థాన్: అసిక్ అటూ, టోగిజ్కుమలక్, కజాక్ కురేసి రష్యా: గోరోడ్కి, సాంబో దక్షిణాఫ్రికా: కగాటి, ఇంటోంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్: అల్ తబ్బా

బిక్స్ దేశాల మధ్య క్రీడా రంగంలో సహకారాన్ని పెంపొందించుకునేందుకు, సంప్రదాయ, స్వదేశీ క్రీడలను ప్రోత్సహించేందుకు విదేశీ ప్రతి నిధి బృందాలతో ద్వైపాక్షిక సమావేశాలు జరుగుతాయి.

ఈ క్రీడల్లో పాల్గొనే దేశాల గొప్ప క్రీడా వారసత్వాన్ని వేడుకగా నిర్వహించటమే కాక, బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర అవగాహనను, సాంస్కృతిక మార్పిడిని, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలపరిచే వేదికగా ఇది నిలుస్తుంది.

## చెరువులో మునిగి యువకుడి మృతి.. తండ్రికి దూరమైన ముగ్గురు చిన్నారులు!

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 10:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. చేపలు, తాబేళ్లు పట్టేందుకు స్నేహితులతో కలిసి చెరువులోకి వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో ఈ ఘటన జరిగింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న యువకుడు మృతి చెందడంతో భార్య, ముగ్గురు చిన్నారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

వెంకటాపూర్ గ్రామానికి చెందిన మోతే ఎల్లయ్య, ఎల్లవ్వ దంపతుల కుమారుడు మోతే కిరణ్ స్నేహితులతో కలిసి చేపలు, తాబేళ్లు పట్టేందుకు చెరువులోకి దిగాడు. ఈ క్రమంలో లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగిపోయాడు. కిరణ్ ఆచూకీ కోసం శుక్రవారం గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయింది. శనివారం ఉదయం అతడి మృతదేహాన్ని వెలికితీశారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కిరణ్‌కు భార్యతోపాటు ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న అతడు మృతి చెందడంతో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.